15 నుండి సీనియర్ నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఈనెల 15 నుండి 21వ తేదీ వరకు సీనియర్ నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్ 22-23 నిర్వ హిస్తున్నట్లు ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ అసోసియేషన్ డైరెక్టర్ జీవ విలియమ్స్, ట్రెజరర్ డా. ఎంసి వెంకటసుబ్బయ్యలు తెలిపారు. సోమవారం కడప నగరం మురళి థియేటర్ దగ్గరలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు 35 సంవత్సరముల నుండి 75 సంవత్సరములు గల వారికి నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలు కడప ఆఫీసర్స్ క్లబ్లో, యునైటెడ్ క్లబ్ లో, మున్సిపల్ స్టేడియంలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీలకు ప్రెసిడెంట్‌గా జిల్లా కలెక్టర్ విజయరామరాజు వైస్ ప్రెసిడెంట్ జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మలు వ్యవహరిస్తున్నారనీ వారి చేతులమీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు కందుల ఫ్యామిలీ, అరుణాచల ఇనిస్టిట్యూట్‌ల వారి సహకారంతో అందిస్తున్నామని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొను వారికి వసతులు కల్పించబడు ననీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బసిరెడ్డి, అఫ్జల్, అతావుల్లా, మీడియా ఇన్చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రైతు సంక్షేమం సాధ్యం: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: రైతు సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. దేశంలోనూ రాష్ట్రంలో పాలనా ప్రభుత్వాలు ఘోరంగా విఫలమైన నేపథ్యంలో ప్రజలు కాంగ్రెస్‌పార్టీని కోరుకుంటున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన అనంతరం అధికారం చేపట్టిన అప్పుడు టీడీపీ ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యాయని ధ్వజమెత్తారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులల్లో వ్యవసాయం, అనుబంధరంగాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. సమాజంలో 70శాతం రైతులు ఉన్నప్పటికీ బడ్జెట్ కేటాయింపుల విషయానికి వచ్చే సరికి 2021-22లో 3.77శాతం ఉండటం గర్హణీయమన్నారు. 2022-23లో 3.51శాతం 2022-23 లో 2.77శాతమే కేటాయింపులు జరిపారన్నారు. ఇక జగన్ వైఖరి చూస్తే అతని కంటే ఘనుడు మల్లన్న అన్న చందంగా ఉందని ఎద్దేవాచేశారు. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి రాగానే ఏటా వ్యవసాయ పెట్టుబడి కింద రూ.12500లు అందజేస్తామని వాగ్దానం చేసి అధికారం చేపట్టాక అందులో నుంచి రూ.5వేలు కోత విధించారన్నారు. రైతులకు వడ్డీలేని రుణులు అందజేస్తామని మేనిపెస్టోలో పెట్టి అధికారం చేపట్టిన తర్వాత కాంగ్రెస్ హయాంలో అమలు చేసిన సున్నావడ్డీ పథకానికి సున్నం పెట్టిందని ఎద్దేవాచేశారు. ప్రతి నియోజకవర్గంలో కోల్డ్‌స్టోరేజీలు ఏర్పాటు చేసి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చి ఆ హామీని నాలుగేళ్లు కావస్తున్నా కార్యరూపం దాల్చలేదని దుయ్యబట్టారు. ఎగువన ఉన్న అటు తెలంగాణ ఇటు కర్నాటకలో అక్రమంగా సాగునీటి ప్రాజెక్టులను చేపడుతున్నా జగన్ ప్రభుత్వం అడ్డుకోవడంలో ఘోరంగా వైఫల్యం చెందారని ఆరోపించారు. ఇవన్నీ ఆలోచించిన తర్వాత రైతులు కాంగ్రెస్‌పార్టీనే కావాలని ఆశిస్తున్నారన్నారు. రాబోవు కాలంలో రైతుల కోరిక నెరవేరుతుందని, కాంగ్రెస్‌పార్టీ కచ్చితంగా అధికారం చేపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు

విశాలాంధ్ర-కడప రూరల్ : కడప నగరంలోని చిలకలబావి దగ్గర వున్న ఏఐటీయూసీ ఆఫీస్‌లో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ అసోసియేషన్ ఏఐటీయూసీ కడప జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు ఎస్.మంజుల, ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికులకు ఫేస్ అటెండెన్స్ యాప్‌ను అమలు చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నదని అంగన్‌వాడిలకు వేతనాలు పెంచి, గవర్నమెంటు ఉద్యోగులుగా గుర్తించే వరకు ఫేస్ అటెండెన్స్ యాప్ విధానాన్ని వ్యతిరేకిస్తూ, ప్రభుత్వ ఉద్యోగులగాగుర్తించి, వేతనాలు పెంచాలని, లేని పక్షంలో దశల వారీగా ఆందోళనలు జరుపుతామని ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్ అసోసియేషన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా సమితి తెలిపారు. మా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్మికులను ప్రభుత ఉద్యోగులుగా గుర్తించాలని, అంగన్వాడీ కార్మికులకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్మికులకు 62 సంవత్స రాలకు పెంచి, పెన్షన్ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమవేశంలో ఏఐటీయూసీ కడప జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, అంగన్వాడీ జిల్లా నాయకులు విజయ, శ్రీదేవి, కొంతమ్మ, వసుందర, విజయకుమారి, వాసంతి, తులసి పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రతో టిడిపి గ్రాఫ్ శాశ్వతంగా పడిపోయింది

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ తిరిగి కోలుకునే పరిస్థితి లేదని, ఆ పార్టీకి మిగిలి ఉన్న కాస్త గ్రాఫ్ కూడా నారా లోకేష్ పాదయాత్రతో పూర్తిగా పడిపోయిందని వైఎస్ఆర్సిపి కడప నియోజకవర్గ సీనియర్ నేత, రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని అన్నారు. గత పాలకుల మాదిరిగా కాకుండా కులమతాలకు రాజకీయాలకు అతీతంగా పరిపాలిస్తూ సామాజిక న్యాయం చేస్తున్న ముఖ్యమంత్రి దేశంలోనే మొట్టమొదటి సీఎం అని తెలిపారు. అటువంటి గొప్ప మనిషి గురించి యువకులంలో నారా లోకేష్ మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. 2024 లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో 175 కు 175 స్థానాలు కచ్చితంగా గెలిచి సాధించి తీరుతామని ఆయన తెలియజేశారు.

ప్రకృతి ఆహారం ఆరోగ్య ప్రదాయిని

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : ప్రకృతి ఆహారమైన రాగిసంగటి, సొద్ద సంగటి, జొన్న సంగటితో మనిషి ఆరోగ్యంగా ఉంటాడని ప్రతి ఒక్కరు పాతకాలం తినే ఆహారం అలవాటు చేసుకోవాలని అప్పుడే వారి ఆరోగ్యం శుభప్రదంగా ఉంటుందని సీనియర్ పాత్రికేయులు ప్రదీప్ అన్నారు. సోమవారం స్థానిక కాశీవిశ్వేశ్వర దేవాలయం నందు ప్రదీప్ అత్త మామ అయిన కీ.శే.దరిశ నాగేశ్వరరావు, వారి ధర్మపత్ని దరిశ చండీరాణిల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై అన్నప్రసాదం దంపతులు వడ్డించారు. ఈ కార్యక్రమంలో యనమదల కిరణ్‌కుమార్, విశాలాంధ్ర విలేకరి గుండ్రాతి మహేశ్వరయ్య, వంట మాస్టర్ రమణ, వెంకటేష్, పాల్గొన్నారు.

అప్పులతో ఆత్మహత్య ఉదంతంలో మలుపులు

అప్పులు ఏకంగా రూ.65కోట్లు- రోధిస్తున్న బాధితులు- మృతుడి కుటుంబానికి రాజకీయ నేతల అండ



విశాలాంధ్ర-యర్రగుంట్ల : జిల్లాలో రూ.65కోట్ల మేర ఐపీ ఘటనలు ఇటీవలి కాలంలో లేవు. కానీ పారిశ్రామిక ప్రాంతంగా గుర్తింపు పొందిన ఎర్రగుంట్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఏకంగా రూ.65కోట్ల మేర అప్పులు చేసి చివరకు ఆత్మహత్య చేసుకున్న ఘటన కొన్ని రోజుల క్రితం చోటుచేసుకుంది. సహజంగా ఎవరైనా ఆత్మహత్య చేసుకుంటే అయ్యోపాపం అనడం సహజం. కానీ సదరు వ్యక్తి విషయంలో అతడి ఆత్మహత్య కన్నా చేసిన అప్పుల మొత్తాన్ని తెలుసుకొని అంత డబ్బు ఏం చేశాడు అంటూ ఈ ప్రాంత వాసులు నేటికీ విశేషంగా చర్చించుకుంటున్నారు. మండల పరిధిలోని ఓ ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్న సదరు వ్యక్తి రియల్ ఎస్టేట్ వ్యాపారిగా గుర్తింపు పొందాడు. ఈ నేపథ్యంలోనే అతడు ఏకంగా రూ.65కోట్ల మేర అప్పులు సంపాదించగలిగాడు. చివరికి ఎక్కడా సెంటు స్థలం లేదు కానీ రూ.65కోట్లు అప్పులు మిగలడం గమనార్హం. ఈ డబ్బులు ఏం చేశాడో తెలియదు గానీ కొన్ని రోజుల క్రితం స్వగృహంలో ఉరి వేసుకొని చనిపోవడం జరిగింది. వెంటనే రంగప్రవేశం చేసిన రాజకీయ పార్టీ నేతలు ఈ ఆత్మహత్యను కీలక మలుపులు తిప్పారు.మృతుడు ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగి కావడంతో గుండెపోటుతో మృతి చెందినట్లు ప్రచారంలోకి తెచ్చారు. మృతుడు ఎలా చనిపోయింది గ్రామస్తులకే కాదు ఈ ప్రాంత వాసులందరికీ తెలుసు. అయినా మృతుడి భార్యకు సదరు ఉద్యోగం రావాలంటే ఆత్మహత్య అంశాన్ని తెరపైకి తేకూడదని వారు భావించారు. అలా సమర్థవంతంగా గుండెపోటుతో మృతి అంటూ పత్రికలో కథనం వచ్చేలా చూడగలిగారు. మానవీయ కోణంలో ఇదంతా బాగానే ఉంది. కానీ అసలు విషయం ఏమిటంటే సుమారు 400 మంది సదరు వ్యక్తికి రూ.65కోట్ల మేర అప్పులు ఇచ్చి ఉన్నారు. మృతుడి పేరుపై ప్రస్తుతం ఎలాంటి ఆస్తులు లేవు. మృతుడికి అప్పులు ఇచ్చిన వారంతా ధనికులు కాదు. పేద, మధ్యతరగతి వారు కూడా ఉన్నారు. వడ్డీ కింద కొంత మొత్తం వస్తుంది కదా యని వారంతా అప్పులు ఇచ్చారు. మృతుడు ఎవరికీ అనుమానం రాకుండా ఈ అప్పులు సంపాదించడం ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. మొత్తంగా ఇంత పెద్ద మొత్తం ఏం చేశాడన్నదే మిస్టరీగా మారింది. మృతుడికి ఎలాంటి చెడు అలవాట్లు లేవని గ్రామస్తులు అంటున్నారు. కాయకష్టంతో తాము సంపాదించుకున్న డబ్బంతా పోవడంతో కొందరి రోదన అరణ్యరోదనగానే మిగిలిపోతోంది. తమ ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం దాచుకున్న డబ్బు ఇలా మాయం అవడంతో మరి కొందరు పెడబొబ్బలు పెడుతున్నారు. కానీ పరిష్కారం కనిపించడం లేదు. ఆత్మహత్య మలుపులు తిరిగి సుమారు 400 మందికి చెందిన కుటుంబాల్లో విషాదం నింపింది.

విద్యా వైజ్ఞానిక ప్రదర్శన రాష్ట్రానికే తలమానికం: డీఈఓ దేవరాజ్

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణం అహోబిలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన రాష్ట్రానికే తలమానికంగా ఉందని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజ్ కొనియాడారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక సదస్సును సోమవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ నాడు -నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఎంతో అద్భుతంగా రూపుదిద్దుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఉన్నత పాఠశాలలో మనం నాలుగు దశాబ్దాల తర్వాత తొలిసారిగా ఈ సైన్స్ ఫెయిర్ పులివెందుల వాసి అయిన జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇక్కడ నిర్వహించుకోవడం హర్షించతగ్గ వషయమన్నారు. కార్యక్ర మానికి సంబంధించి పనిచేసిన అన్ని సమన్వయ కమిటీలు తమ వంతు కర్త వ్యాన్ని క్రమశిక్షణగా నిర్వహించడం వల్లే, ఈ కార్యక్రమం ఇంత దిగ్విజయంగా జరిగిందని వెల్లడించారు. జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ సైన్స్ ఫెయిర్ లో వివిధ పాఠశాలల నుంచి ఇక్కడకు విచ్చేసిన 180 సైన్స్ నమూనాలు ప్రదర్శనకు సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ విజయం వెనుక పులివెందుల మండల విద్యాశాఖ అధికారి వీరారెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, సైన్స్ ఫెయిర్ జరుగుతున్న ఈ సభా ప్రాంగణము ఇక్కడ నిర్వాహకులు ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారని, భవిష్యత్తులో ఇక్కడి విద్యార్థులు సైన్స్‌లో ఎన్నో అద్భుతాలు సృష్టించాలని ఆకాంక్షించారు. మండల విద్యాశాఖ అధికారి వీరారెడ్డి మాట్లాడుతూ ఇంతటి విజయానికి మూలం డిఈఓ ప్రోత్సాహమే అన్నారు. మంచి మనసుతో చేపట్టే ఏ కార్యక్రమానికైనా నిర్వాహకుల్లో ఉత్సాహం, ప్రోత్సాహం నింపడానికి సహృదయంతో సహాయ సహకారాలు అందించే సమాజం ఉందన్నారు. లింగాల, సింహాద్రిపురం మండల విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమం మన పట్టణంలో జరగడం మనకెంతో గర్వకారణమన్నారు. అనంతరం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి.

పేదలపై ఎస్ఐ వ్యవహరించిన తీరు సరికాదు

విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరులోని సుందరయ్య నగర్ లో ఆదివారం పోలీసులు వ్యవహరించిన తీరు సరికా దని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ అన్నారు.సోమవారం సిపిఎం మండల కార్యదర్శి షరీఫ్ తో కలసి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ విలేకరులతో మాట్లాడుతు ఆదివారం ఉదయం7,గంల సమయంలో మైదుకూరు మున్సిపాలిటీలోని పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో స్థానిక ఎస్ఐ మద్దిలేటి మరో 10మందిదాక పోలీసులువచ్చి వీధి,వీధి,తిరిగి15,మోటార్ సైకిళ్లు,బైకులు తీసుకెళ్లారని వారు తెలిపారు. ఇండ్ల దగ్గర వున్నమోటార్ బైక్ లను తీసుకెళ్లటం అన్యాయమని కాలనీ ప్రజలు అడగగా స్టేషన్ దగ్గరకు వచ్చి తీసుకెళ్ళమని ఎస్ఐ చెప్పారనికాలనీ ప్రజలు తెలిపారని వారు తెలిపారు. దొంగల నివాసాలమీదదాడి చేసినట్లుగా ఎస్ఐ పేదల కాలనిమిదకు ప్రజలు నిద్రలో వుండగానే తన సిబ్బందితో రావటమేంటని వారు ప్రశ్నించారు. సుందరయ్య కాలనీలో సంసారం ఉన్నవారు అత్యంత పేదలని భవన నిర్మాణ కార్మికులు,శనివారం సంతలో పనిచేసేవారు, వ్యవసాయ కార్మికులు, ఆటో డ్రైవర్లు రోజువారీ కూలీలు ఇక్కడ జీవనం సాగిస్తున్నారని ఇటువంటి వారు 10,15,సంవత్సరాల క్రితం మోటార్ సైకిళ్లను(సెకండ్ హ్యాండ్) కొనుగోలు చేసి వాడుకుంటున్నారని ఇటువంటి వాహనాలను యస్ఐ తన సిబ్బందితో కాలనిలోకివచ్చి తీసుకెళ్లటం అన్యాయమని వారన్నారు.రోడ్డుమీద బైక్ లు ఆపి రికార్డ్స్ లేకుంటే చలానాలువేయటం సర్వసాధారణమని కానీఇలా కాలనీ మిదికొచ్చి ఇండ్ల దగ్గరున్న బైక్ లను తీసుకెళ్ళి పోలీస్ స్టేషన్ దగ్గర 500, 1000రూపాయల వంతున పైన్లు వేయటం అన్యాయమనివారన్నారు. ఉదయం 7,గంలకే పోలీసులు కాలనీలోకి రావటం తో అక్కడి మహిళలు తీవ్ర భయబ్రాంతులకు గురయ్యారని వారన్నారు. ఈ విధంగ వ్యవహరించటం ఎస్ఐ కి సరికాదని జరిగిన సంఘటనను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సమావేశంలో సిపిఎం నాయకులు రాయప్ప, రవి,బాబు,పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి జీవదారు ధ్వజస్థంబ ప్రతిష్టాపన మహోత్సవాలు

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ధ్వజస్థంబం ప్రతిష్టాపన మహోత్సవాల సందర్భంగా నేటి నుండి అంగరంగ వైభవంగా 16వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఫిట్‌పర్సన్, జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ శంకర్‌బాలాజి పర్యవేక్షణలో నిర్వహించడం జరుగుతుందని మఠం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి తెలిపారు. వీరబ్రహ్మేంద్రస్వామి దివ్య మఠమున ఏడవతరం పదకొండవ పీఠాధిపతులు పూర్వపు మఠాధిపతులైన శ్రీశ్రీశ్రీ వీరభోగ వసంతవెంకటేశ్వరస్వాముల వారిచే సంకల్పించబడి జీర్ణోద్ధారణ గావింపబడి శ్రీ స్వామివారి భక్తుడు కలసపాడు మండలం ఎగువ తంబళ్లపల్లె గ్రామ వాస్తవ్యులు పెదకంటికాపులు, ముదినోళ్ల గోత్రఛ్ఛవులు గంగసాని వంశస్థులచే(శాశ్వత ధ్వజస్థంబ దాతలు) నూతనముగా జీవ దారు ధ్వజస్థంబ ప్రతిష్టాపన మహోత్సవము త్రయాహ్నిక దీక్షగా పరశివ విశ్వకర్మ ఆగమోక్తముగా ఆస్థాన ఆధ్వర్యులచే నిర్వహించబడుటకు స్వామి వారి అనుజ్ఞ అయి ఉన్నందున పెద్దలచే సుమూహూర్తమం నిశ్చయించడమైనదని కావున స్వామి వారి శిశ్యులు, భక్తులు విచ్చేసి కార్యక్రమంలో స్వామివారి తీర్థప్రసాదములు స్వీకరించి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి కృపకు పాత్రులు కావాలని తెలిపారు. నేడు 14వ తేదీ ఉదయం 5గంటలకు మంగళవాయిద్య ఘోశ, సుప్రభాత సేవ, ఆలయ మరియు యాగశాల ద్వారతోరణ బంధనము, తీర్థయానము, గోపూజ, విఘ్నేశ్వర పూజ, స్వస్తి పుణ్యావాహచన, యాగశాల ప్రవేశం, అఖండస్థాపన, షోడశస్థంభ పూజ, ప్రధాన కళశస్థాపన నైవేద్య మంత్ర పుష్ప మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం 5గంటలకు వైదిక స్వస్తి, మృత్సంగ్రహణము, అంకురారోపణము, వాస్తు, యోగిని, క్షేత్రపాలక, నవగ్రహ, సర్వతో భద్రగణ మండప, శబ్రబ్రహ్మర్షి గోత్ర ఋష్యావాహణ ఆరాధణము, అగ్ని ప్రతిష్ట మూల మంత్ర హవనము, ధ్వజ స్థంబమునకు జలధివాస స్నపనము, మంగళహారతి తీర్థప్రసాద వినియోగం. 15వ తేది బుధవారం ఉదయం 5గంటలకు మంగళవాద్య ఘోశ, సుప్రభాతో షనిత పఞ్సూక్త, పంచబ్రహ్మాపనిషత్ పారాయణ, తీర్థానయనము, విఘ్నేశ్వరార్చన, స్వస్తిపుణ్యాహవాచనము, యంత్ర జీవ ధ్వజ స్థంబ స్నపనము, అవాహనాది దేవతామూర్తి దీక్ష విశేశ హెూమము నిత్యబలి, ఉదయం 11గంటలకు: కన్యా ముత్తైదువులచే సామూహిక కుంకుమార్చన, మంగళహారతి, నైవేద్య మంత్రపుష్ప తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం 5గంటలకు: స్వస్తి, మూర్తి, హెూత ప్రతిష్టాంగ ప్రత్యంగా హెూమాదులు, నిత్యబలిహోరణ, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, ఫలాది వాసం, మరియు నైవేద్య మంత్రపుష్ప మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం. 16వ తేది గురువారం ఉదయం 5గంటలకు: సుప్రభాతోషనిత పారాయణము, విఘ్నేశ్వరార్చన స్వస్తిపుణ్యాహవాచనం, వాస్తు హవనం, పర్యగ్నీకరణం, ఉదయం 10:30నిమిషాలకు: గర్త, రత్న, బీజం, ధాతు, యంత్ర లోహన్యాసాదులు, యంత్ర జీవ దారు ధ్వజ ప్రతిష్టపన, అష్టబంధన, కళావాహణ, కళాన్యాస కంభ దేనుపూజ, మహాపూర్ణాహుతి, దేశగ్రామస్వస్తి, శాంతి మంత్ర పారాయణం, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ చేసినట్లు మఠం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి తెలిపారు.

యర్రగుంట్లలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

వైసీపీకి చరమగీతం పాడుదాం- నేతలకు సమస్యల హారతి

చెత్తకు పన్ను విధించిన చెత్త ప్రభుత్వం- టీడీపీ ఇన్‌ఛార్జి 'భూపేష్' ఎద్దేవా

విశాలాంధ్ర-యర్రగుంట్ల : రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అందుకు వీలుగా జరగనున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి బాసటగా నిలవాలని జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యులు చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పురపాలిక పరిధిలోని 7వ కౌన్సిల్ వార్డులో రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. భూపేష్‌తో పాటు పార్టీ మండల పర్యవేక్షకులు చదిపిరాళ్ల జయరామిరెడ్డి, మండల బాధ్యులు మాలేపాడు మోహన్‌రెడ్డి, పట్టణ బాధ్యులు సానపురెడ్డి సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు. వీరు వార్డులోని ప్రతి గడప తలుపు తడుతూ నేరుగా ప్రజలను కలుసుకొని రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. వైసీపీ అరాచక పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొని ఉందని వారు దుయ్యపట్టారు. చెత్త మీద పన్ను విధించిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందని వారు ఎద్దేవా చేశారు. ప్రభుత్వ అస్తవ్యస్థ, అరాచక విధానాలతో ప్రజల జీవితం దుర్భరంగా మారిందని గతంలో ఎన్నడు లేని విధంగా ప్రజలపై ఈ ప్రభుత్వం విపరీతమైన భారాలు మోపిందని రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని వారు ధ్వజమెత్తారు. మార్చి నెలలో జరిగే పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో టీడీపీ పక్షాన పోటీ చేస్తున్న భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిని గెలిపించడం ద్వారా వైసీపీ పతనాన్ని శాసించాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన తనను ఆశీర్వదించాలని ప్రజలను ఈసందర్భంగా భూపేష్ కోరడం కనిపించింది. తొలుత ఇక్కడి రామాలయంలో శ్రేణులతో కలిసి భూపేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా నేతల దృష్టికి తెచ్చారు. తాము అధికారంలోకి రాగానే అన్ని విధాలుగా ఆదుకొనే చర్యల కు శ్రీకారం చుడతామని భూపేష్ వారికి హామీ ఇవ్వడం కనిపించింది. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

బాణాసంచా పేలుళ్ళు, డప్పు వాయిద్యాలు, పూలవర్షం కురిపిస్తూ నేతలకు ఘనస్వాగతం లభించింది. కొందరు తేనేటి విందు ఏర్పాటు చేయగా మరికొందరు శీతల పానీయాలు అందించడం కనిపించింది. ఇంకొందరు అల్పాహారం ఏర్పాటు చేశారు. శ్రేణులు రాత్రి విందు భోజనం ఆరగించారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డుకు చెందిన నాయకులు, కార్యకర్తలతో పాటు నందమూరి, దేవగుడి కుటుంబాల అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

16న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండలంలో ఉన్న గ్రామాల అభివృద్ధి, త్రాగునీటి సమస్యలు, పారిశుద్ధ్యంపైన మండల స్థాయి అధికారులతో, ప్రజా ప్రతినిధులతో మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 16వ తేదిన ఏర్పాటుచేయడం జరిగిందని మండల అభివృద్ధి అధికారి వెంగమునిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో ఉన్న 14సచివాలయ పరిధిలోని గ్రామ సమస్యలు, త్రాగునీటి సమస్యలు, పారిశుద్ధ్యంను దృష్టిలో పెట్టుకొని అన్ని శాఖల అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, జడ్పీటీసీ రామగోవిం దారెడ్డి, మండల అధ్యక్షులు వీరనారాయణ రెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటుచేస్తామని అన్నారు. అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు అధికారులు తప్పకుండా హాజరుకావాలని అన్నారు.

ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ సభ్యులకు సన్మానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని మైదుకూరు రోడ్డులో ఉన్న ఎస్సీ రైట్స్ ప్రొటక్షన్ సొసైటీ(ఎస్‌సీఆర్‌పీఎస్) కార్యాల యంలో నూతన సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన యర్రగుడి చంద్రబాబుతో పాటు మిగిలిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆగిలి సురేష్, ఓబులేసును, కైలా రాంబాబు, నాగలారపు ఓబయ్యలను తెలుగుదేశం పార్టీ పట్టణ మైనార్టీ అధికార ప్రతినిధి కమ్మబాయ్ గారి గౌస్‌బాషా, టింబర్ డిపో యజమాని అబ్దుల్ ఖాదర్, డీపీఎస్ ప్యాకర్స్ మూవర్స్ యజమాని బండి శ్రీనివాసు లు, ప్రొద్దుటూరు స్వర్ణకారుల సంఘం కార్యవర్గ సభ్యులు షేక్ హబీబుల్లాలు సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం వారందరికి అభినందనలు తెలిపారు. మరెన్నో పదవులు పొంది పేద ప్రజల తరపున పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లె పంచాయతీ 15వ వార్డ్‌మెంబర్ బాలయ్య, ఖాజాపీర్, నజీర్, గులాం రసూల్, మహబుబ్ బాష, చౌటపల్లె యూత్ పందింటి వినోద్, మేకల అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం : టీడీపీ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: వైకాపా ప్రభుత్వం ఆంధ్రప్రదేష్‌ను అంధప్రదేష్‌గా మార్చిందని, రాష్ట్రాభివృద్ధి జరిగి ప్రజలు సుభిక్షం గా ఉండాలంటే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం అని టీడీపీ నియోజికవర్గ ఇంచార్జ్ డా.జీవి ప్రవీణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని శ్రీరాముల పేటలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన నిత్యావసరాల ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని అన్నారు. అపద్ధపు వాగ్దానాలు చెప్పి వైకాపా అధికారం లోకి వచ్చిందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించారని అన్నారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రాకపోగ, జే-ట్యాక్స్ భయంతో కంపెనీలు పక్క రాష్ట్రాలకు పారిపోతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో షబ్బీర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తాటి శ్రీనివాసులు యాదవ్, మేరువా మూర్తి, తమ్మిశెట్టి సురేంద్ర, టీఎన్‌టీయూసీ పట్టణ కార్యదర్శి తమ్మిశెట్టి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కొండపేటలో ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - చెన్నూరు : ఈ నెల 15వ తేదీ బుధవారం కొండపేట నందు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పెదబల్లె సుధాకర్ రెడ్డి తెలిపారు, సోమవారం ఆయన చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ కీర్తిశేషులు పెదబల్లి సుబ్బారెడ్డి(కొండపేట రెడ్డి) కీర్తిశేషులు పెదబల్లె శివారెడ్డి(మాజీ సర్పంచ్) జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుపత్రిక వారిచే కొండపేట నందు 15వ తేదీ బుధవారం నాడు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి అమర్నాథరెడ్డి, డాక్టర్ జిగీష, డాక్టర్ శ్రావణి నేతృత్వంలో ప్రత్యేక కంటి పరీక్షలు, అలాగే శస్త్ర చికిత్సలు నిర్వహించి, అవసరమైన వారికి పుష్పగిరి కంటి ఆసుపత్రి నందు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించబడతాయన్నారు. ఇందులో ప్రత్యేకంగా శుక్లములకు ఆధునిక ఆపరేషన్, మెల్లకన్ను వారికి ఆపరేషన్, రెటీనా ఆపరేషన్, కార్నియా ఆపరేషన్, గ్లూకోమా (పీటి కాసులు) ఆపరేషన్లు, కంటి ప్లాస్టిక్ సర్జరీ, చిన్నపిల్లల కంటి చికిత్స ఆపరేషన్లు, కంటి శుక్లాలు గుర్తించి వారికి కంటి (కుట్లు లేని) ఆపరేషన్ నిర్వహించబడునని, కాంటాక్ట్ లెన్స్, వంటి మొదలగు శస్త్ర చికిత్సలు, నిర్వహించబడతాయన్నారు.ఆపరేషన్లు చేయించు కుని వారు ఆధార్ కార్డు, అదేవిధంగా ఆరోగ్యశ్రీ కార్డు తప్పక తీసుకురావాలన్నారు.

హమారా ప్రసాద్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలి

విశాలాంధ్ర-బద్వేల్ : బాబాసాహెబ్ బియర్ అంబేద్కర్‌ని కాల్చి చంపుతానని మతోన్మా దముతో అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాదుపై పీడీ యాక్ట్ రాజా ద్రోహం కేసు నమోదు చేసి అతన్ని కఠినంగా శిక్షించాలని దళిత ప్రజా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నాడు మాల మహాసేన జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భారతదేశ పౌరులకు కాక ప్రపంచ దేశాలలో మేధావి అయిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం నేనే బతికుంటే ఆనాడు గాడ్సే గాంధీని చంపినట్టు అంబేద్కర్‌ని కూడా చంపేవాడని అని కుల దురంకారముతో మత ఉద్దేశ్యంతో మతము మతోన్మాదం మాట్లాడడం భారతదేశ పౌరులందరికీ అవమానమని అటువంటి వాడిని ఇతని తీవ్రవాదులుగా పరిగణించి అతనిపై కఠిన చర్యలు తీసుకొని జీవితాంతం జైల్లో ఉండే మాదిరిగా చేయాలని చెప్పి దానికోసం ఈ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుని దానికి వాళ్లు కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇకనైనా అంబేద్కర్ గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పూలే అంబేద్కర్ రాజ్యాంగ సమితి కో ఆర్డినేటర్ ముండ్లపాటి పిచ్చయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యనిర్వాహన అధ్యక్షుడు పడిగే వెంకటరమణ, మాల మహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి, పూలే అంబేద్కర్ రాజ్యాధికారి సమితి బద్వేల్ తాలూకా అధ్యక్షుడు నాగిపోగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా



ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కడప ఆర్డీవో పి.ధర్మచంద్రారెడ్డి, బద్వేలు ఆర్డీవో వెంకట రమణ, ఎస్.ఎస్.ఏ. పీఓ ఏ.ప్రభాకర్ రెడ్డి సంయుక్తంగా ఎన్నికల నిర్వహణ అధికారులకు ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని విసి హాలులో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో పాల్గొనే.. ఎన్నికల అధికారులైన ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలెన్స్ టీమ్ సిబ్బందికి మోడల్ కోడ్ అమలు, నిర్వహణపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కడప ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో గత ఎన్నికలను ఎలా సజావు గా, ప్రశాంతంగా పూర్తి చేశారో అదే స్ఫూర్తితో ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా సజావుగా, సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు.. "మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్" విధిగా పాటించాలన్నారు. ఎస్.ఎస్.ఏ. పీఓ అంబవరం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల విధులను కేటాయించిన అధికారులకు వేర్వేరు బాధ్యతలకు సంబంధించి వేర్వేరు వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేసి రోజువారీ విధుల సమాచారాన్ని అందులో షేర్ చేసుకోవాలన్నారు. స్టాటిక్ సర్వైలెన్స్ ద్వారా మండల సరిహద్దు ప్రాంతాల్లో లిక్కర్, నగదు, తదితర ఓటర్లను మభ్యపెట్టే కానుకలు వాహనాల్లో తరలిస్తున్నట్లు గుర్తిస్తే.. సంబంధిత మండల తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో పిఆర్డీలు, మండలాల ఈఈలు, వ్యవసాయ విస్తరణాధికారులు తదితర నోడల్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైకిల్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

విశాలాంధ్ర - వల్లూరు : ఎస్.జి.ఎఫ్ అండర్ 19 రాష్ట్ర సైక్లింగ్ పోటీల్లో వల్లూరు మండలం గంగాయపల్లి ఏపీ మోడల్ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కే.వాసంతి ద్వితీయ స్థానం సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నర్సారావు పేటలో నిర్వహించిన ఎస్.జి.ఎఫ్ అండర్ 19 రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం సాధించి జాతీయస్థాయికి ఎంపిక కావడం కళాశాలకు మంచి పేరు తెచ్చారని విద్యార్థిని అభినందించారు. కళాశాల సిబ్బంది పి.డి సుశీలమ్మ విద్యార్థిని అభినందించారు.

నమూనా పరీక్షకు విశేష స్పందన

విశాలాంధ్ర-కడప రూరల్ : సాధన చేస్తే ఏదైనా సాధ్యమే అని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ద్రావిడ సురేష్ అన్నారు. సోమవారం వెంకట సాయి కోచింగ్ సెంటర్ నందు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ ఎస్సై అభ్యర్థులకు ఉచితంగా నమూనా పరీక్ష (మోడల్ టెస్ట్) నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పోటీ పరీక్ష అయిన నమూనా పరీక్ష వ్రాయడం వలన మెళకువలు తెలుసుకుని సమయం వృధా కాకుండా ధైర్యంగా రాయగలుగుతారన్నారు. నమూనా పరీక్షలు రాయకపోవడం వలన అభ్యర్థులు తప్పులు చేస్తున్నారని ఓఎమ్ఆర్ షీట్‌లో, బబ్లింగ్ చేయటంలో తప్పులు చేయటం సమాధానాలు తెలిసి సమయం వృధా కావడం వలన మార్కులు పోగుట్టుకుంటున్నారని ఇలాంటి వాటిని అధిగమించేందుకు నమూనా పరీక్షలు వ్రాయటం మేలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి ఎమ్ చైతన్య, జిల్లా కార్యవర్గ సభ్యులు శివ నాగేంద్ర, నాగార్జున, జయ రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మైనార్టీ జిల్లా కార్యదర్శిగా పూలబక్స్

విశాలాంధ్ర-వేంపల్లె: వేంపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు పూలబక్స్ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆ మేరకు ఆ పార్టీ అధిష్టానం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చినట్లు టీడీపీ వర్గీయులు తెలిపారు. పూలబక్స్ చాలా కాలం నుంచి టీడీపీలో కొనసాగుతున్నారు. రాజకీయ అనుభవం ఉన్న నేతగా పూలబక్స్‌కు పేరుంది. మండల, నియోజకవర్గ స్థాయిలో అందించిన సేవలను జిల్లా స్థాయిలో కూడా పూలబక్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్న ఉద్దేశంతో కార్యదర్శిగా నియమించినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పూలబక్స్‌ను టీడీపీ మండల కన్వీనరు రామ మునిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. పూలబక్స్ మాట్లాడుతూ తనకు అప్పగించిన పదవికి న్యాయంచేస్తానన్నారు. జిల్లాస్థాయిలో టీడీపీ కేడర్‌ను మరింత విస్తృత పరచేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

శనగల కొనుగోలు ప్రారంభం

విశాలాంధ్ర - కమలాపురం : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మద్దతు ధరతో శనగల కొనుగోళ్లు జిల్లాలో ప్రారంభించినట్లు మార్కుఫెడ్ జిల్లా అధికారి తాటిగుట్ల. నరసింహా రెడ్డి తెలిపారు. సోమవారం అయన జిల్లా వ్యవసాయ అధికారి అయిత. నాగేశ్వరరావు తో కలిసి కమలాపురం డీసీఎంఎస్ కేంద్రం ద్వారా, కమలాపురం మార్కెట్ యార్డ్ నందు కొనుగోలు ప్రారంభించారు. ప్రభుత్వం మద్దతు ధర రూ 5335 గా నిర్ణయించిందని కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ప్రతి రైతు కేంద్రంలో నమోదు చేసుకున్న తర్వాత తమ చరవాణి కి సంక్షిప్త సమాచారం వస్తుందని దాని ప్రకారం రోజుకు గరిష్టంగా 25 కింటాల్ చొప్పున రైతుల దగ్గర నుంచి కొనుగోలు కేంద్రంలో నాణ్యత ప్రమాణాలు పరిశీలించిన తర్వాత కొనుగోలు చేస్తారని వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్రంలో రైతులు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి, డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ ఖాదర్ వలీ, మేనేజర్ రఘురామి రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అఖిలపక్ష నేతల అరెస్టు దుర్మార్గం

సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

విశాలాంధ్ర-కడప రూరల్ : కడప నగరంలో రామకృష్ణ స్కూలు వెనకాల ఉన్నటువంటి మసీదు స్థలాన్ని భూ కబ్జా దారులు కబ్జా చేసి నిర్మాణం చేపడుతుంటే వాటిని అడ్డంగిం చుకొని శాంతియుతంగా ఆందోళన చేసినటువంటి అఖిలపక్షం నేతలను అరెస్టు చేసి జమ్మలమడుగు పోలీస్ స్టేషన్కు తరలించడం దుర్మార్గమైన విషయమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం భూ కబ్జాలకు నిలయంగా మారిందని కబ్జా చేస్తున్న వారిని అడ్డగించుకోవాల్సింది పోయి తిరిగి పోలీసులొచ్చే ఆందోళనకారులపై కేసులు బనాయించి వారిని ఇబ్బందులు పాలు చేయడం తగదన్నారు. అరెస్ట్ అయిన వారిలో సిపిఐ నాయకులు వెంకటశివ, బాదుల్లా, భాష, టిడిపి నేతలు అమీర్‌బాబు, సనావుద్దీన్, దాదాపు 15 మందిని అరెస్టు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారిని సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర పరామర్శించారు.

వారిని ఓటర్ల లిస్టు నుండి తొలగించాలి

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : మండలంలోని డబుల్ ఎంట్రీ, చని పోయిన వారిని, ఊరు వదిలి వెళ్లిపో యిన వారిని 2022 ఓటర్ల జాబితా నుండి తొలగించాలని ఒంటిమిట్ట మండల తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు అన్నారు. సోమవారం టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున రాజంపేటలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్‌కు పూర్తిగా ఎవిడెన్స్ ఓటర్ల లిస్టుపై అందజేశారు. గతంలో మేమిచ్చిన ఎవిడెన్స్‌ను స్థానిక మండల అధికారులు సరిగా పరిశీలించక అవి అలాగే ఉన్నాయన్నారు. మేమిచ్చిన ఆధారాలతో పూర్తిగా పరిశీలించి వాటిని తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట మండల నాయకులు, టీడీపీ కార్యకర్తలు హాజరయ్యారు.

ఇడుపులపాయ ట్రిపుల్ఐటి విద్యార్థిని ఆత్మహత్య

విశాలాంధ్ర-వేంపల్లె: వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం వేంపల్లె మండలం ఇడుపులపాయ ట్రిపుల్ఐటిలో అఖిల అను విద్యార్థి ఆత్మహత్య చేసుకుంది. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం పరిధిలోని శిబ్యాల పంచాయతీ బొకినేపల్లి గ్రామా నికి చెందిన విజయ, యోగాంజనేయులు దంపతుల కుమార్తె అఖిల ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. కాగా సోమవారం హాస్టల్ గదిలో ఉరివేసుకుని వేలాడుతున్న అఖిలను చూసి సహచర విద్యార్థులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని డైరెక్టరు సంధ్యారాణికి వివరించారు. అప్పటికే అఖిల మృతిచెందినట్లు పోలీసులు నిర్ధారించారు. వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో అఖిల మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఇక రెండునెలల్లో కోర్సు ముగించుకుని ఇల్లు చేరాల్సి ఉంది. ఈ లోపు ఈ విషాదం చోటు చేసుకోవడం అటు తల్లిదండ్రులను ఇటు సహచర విద్యార్థులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్కెవ్యాలీ పోలీసులు వెల్లడించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

విశాలాంధ్ర-చక్రాయపేట : మండలంలోని చిలేకంపల్లి (సీతారంపల్లి) గ్రామంలో త్రాగడానికి గుక్కెడు నీరు లేక కాసులు వేసి కొనాల్సిన పరిస్థితి ఎదురైంది ఎన్ని ప్రభుత్వాలు మారినా మాకు నీళ్లు ఇచ్చే దిక్కు లేరని గ్రామ ప్రజలు వాపోతున్నారు. చక్రాయపేట మండలం చిలేకంపల్లి (సీతారంపల్లి) గ్రామంలో త్రాగునీరు సమస్యను పరిష్కరించాలని సోమవారం సచివాలయంలోని పంచా యితీ సీక్రెటరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు మాట్లాడుతూ అమృత్ కాల్ మహోత్సవమ్ జరుపుకుంటున్న దేశంలో మా గ్రామానికి ఒక సంవత్సరం కూడా పూర్తిగా తాగడానికి నీళ్లు లేవు గత ఏడాదిన్నర సంవత్సరం నుంచి త్రాగునీరు కొనుకుంటున్నాం, రెక్కాడితే గాని డొక్కాడని మాకు ఇలా గుక్కెడు నీళ్లు కూడా డబ్బులకు కొనుకొనే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఒక నెల వస్తే ఇంకో మూడు నెలలు రావన్నారు. గ్రామంలో ఎక్కడికి అక్కడ చెత్త పేరుకుపోయింది. దానివల్ల గ్రామాల ప్రజలు రోగాల భారిన పడే అవకాశం ఉందని వెంటనే చెత్తను శుభ్రం చేపించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమం లో గ్రామ యువకులు పి.వీరాంజనేయులు, టి.ఆనంద్, కె.జయచంద్రా, జి.రామాంజి, టి. శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరోజినీనాయుడు జయంతి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : స్వాతంత్ర సమర యోధురాలు కవయిత్రి సరోజినీ నాయుడు 144వ జన్మదినాన్ని జాతీయ మానవ హక్కుల న్యాయవాది షేక్ అమీన్ పీరా కార్యాలయం కడపలో ఘనంగా జరపడం జరిగింది. ఈమె జన్మ దినాన్ని "జాతీయ మహిళాదినంగా" కూడా భారతదేశంలో జరుపుకుంటారు. చదువులో ఆమె చురుకుదనాన్ని గమనించిన హైదరాబాద్ నిజాం ఉపకార వేతనాలు ఇచ్చి లండన్ కింగ్స్ కాలేజీలో చదువుకోవడానికి పంపించడం జరిగింది. డిసెంబర్ 1925లో కాన్పూర్ లో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభకు తొలి మహిళా అధ్యక్షురాలుగా వ్యవహరించారు. స్వతంత్ర భారతదేశంలో తొలి మహిళా గవర్నర్గా ఎన్నికయ్యారు. భారతీయ గాన కోకిల సరోజినీ నాయుడు జన్మదిన సందర్భంగా నివాళులర్పించడానికి ప్రముఖ హైకోర్టు న్యాయవాది షేక్, రాయల్ కరీం సేవా సమితి అధ్యక్షులు రయల్ కరిముల్లా, బద్వేల్ సంఘమిత్ర సంస్థ అధ్యక్షులు పెంచలయ్య, యునైటెడ్ ముస్లిం ఫోరం ప్రధాన కార్యదర్శి రఫీక్‌ఖాన్, టిడిపి సిటీ అధ్యక్షులు కొండ సుబ్బయ్య, టిడిపి బీసీ సెల్ ఉపాధ్యక్షులు దస్తగిరి తదితరులు హాజరై ఘనంగా నివాళులర్పించడం జరిగింది.

నగరంలో అభివృద్ధి శూన్యం : టీడీపీ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలో అభివృద్ధి శూన్యం అని గత తెలుగుదేశం ప్రభుత్వంలో మేమేం చేశాము వైసీపీ ప్రభుత్వంలో మీరేం చేశారు చర్చకు ఎక్కడికైనా సిద్ధమని టిడిపి జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు యాదవ్ అన్నారు. సోమవారం ఈ సందర్భంగా గాయత్రి టవర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులు రెడ్డి పైన విమర్శలు చేసే అర్హత నీకు లేదన్నారు. చింతకుంటలో మైనార్టీ నాయకుడుపైన ఏడిపిస్తుంటే ఒక్కరోజైనా మాట్లాడిన చరిత్ర నీకు ఉందా అని ప్రశ్నించారు. రామకృష్ణ కాలేజీ వద్ద మైనార్టీ భూముల్లో పర్సంటేజ్ తీసుకున్నావని మీ మైనార్టీలే ఆరోపణలు చేస్తున్నారన్నారు. కడప నగరంలో క్రైమ్ రేటు తగ్గించేందుకు తన సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ఘనత శ్రీనివాసులు రెడ్డిదని కొనియాడారు. ఎంతోమంది అధికారులను హింసించి నాశనం చేసిన చరిత్ర మీదన్నారు. నెల్లూరులో దొంగ బాబాతో ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషాకు సంబంధాలు ఉన్నాయన్నారు. నగరంలో జమీల్ అనే టీడిపి మైనార్టీ నాయకుడు మీద దాడి చేసి స్థలం కబ్జా చేసిన చరిత్ర మీదన్నారు. చర్చకు మేము సిద్ధం సమయం చెప్పు ఎక్కడికి రావాలో అన్నారు. మీరు చెప్పినట్టే 7 రోడ్స్ సర్కిల్‌లోనే చర్చకు సిద్ధం అని సవాల్ విసిరాడు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా మైనార్టీలకు ఏమి మేలు చేయలేదని, భూములు కబ్జాలకు పాల్పడుతున్నారు.

కుష్టు నివారణపై అవగాహన

విశాలాంధ్ర-వేంపల్లె: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలు అనుగుణంగా స్థానిక వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమ వారం జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమం మీద అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా వచ్చిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి వెంకట రత్నమ్మ కుష్టు వ్యాధి లక్షణాలును గుర్తించుట, తీసుకోవలసిన మందులు వాటి మీద అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపల్ ఎస్ నాగేంద్ర మదర్ థెరీసా, మహాత్మా గాంధీ లాంటివారు కుష్టు వ్యాధిగ్రస్తులను ఎలా ప్రేమించి సేవ చేశారని వివరించారు. డాక్టర్ ఎం ఓబుల్ రెడ్డి సమాజంలో కుష్టు వ్యాధి గలవారని గుర్తించి వారిని ధైర్యపరిచి వారికి చికిత్స అందించవలసిన బాధ్యత విద్యార్థులకు ఉందని విశదీకరించారు. కార్యక్రమంలో కె విజయ కుమారి,ఎస్ అరుణ, మహిళా పోలీసులు ,ఆశా వర్కర్లు పాల్గొన్నారు

మహాశివరాత్రికి నిత్యపూజ కోనలో భారీ బందోబస్తు

కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి

విశాలాంధ్ర-కడప : ఈనెల 18వ తేదీన మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సిద్ధవటం శ్రీ నిత్య పూజ స్వామి కోన ఆలయంలో స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి తెలిపారు.మండల కేంద్రమైన సిద్ధవటం పోలీస్ స్టేషన్లో సోమవారం ఆయన మాట్లాడుతూ ఇద్దరు డిఎస్పీలు ఏడు మంది సీఐలు 20 మంది ఎస్ఐలు 200 మంది సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు నిత్య పూజ స్వామి కోనకు వాహనాలలో వెళ్లే వారు కేటాయించిన ప్రదేశాలలో మాత్రమే వాహనాలను నిలుపుదల చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ పురుషోత్తం రాజు, ఎస్.ఐ తులసి నాగ ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్షిప్ పోటీలలలో కెఎస్ఆర్ఎం విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : వైయస్సార్ జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఈనెల 11-12 తేదీలలో కడప మున్సిపల్ గ్రౌండ్ క్రీడా మైదానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్షిప్-2023 పోటీలలో కెఎస్ఆర్ ఎమ్ విద్యార్థులకు తృతీయ స్థానంలో గెలుపొందారని కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ వివిఎస్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని) మాట్లాడుతూ విద్యార్థులకు విద్యుత్‌తో పాటు, క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించా లని విద్యార్థినీ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు బాలురు ఉదయ్ కుమార్, మన్సూర్, హరి, అజయ్ కుమార్, మౌళి, బాలికల నుండి మహాలక్ష్మి, అనిత, పూర్ణిమ, భార్గవి, నాగాంజలి, గెలుపొందారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ వివిఎస్ మూర్తి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్స్ వంశీ నాయక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోటూరులో కుష్టు నివారణపై అవగాహన

విశాలాంధ్ర-కడప: తొండూరు మండలం సంతకొవ్వూరు ఆరోగ్య కేంద్రం పరిధి లోని గోటూరు గ్రామ సచివాలయంలో సోమవారం కుస్టు వ్యాధి నివారణపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఫామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యాధికారి డా!! ముంతాజ్, గ్రామ సర్పంచ్ యల్. పావని గారి ఆధ్వర్యంలో కుష్టువ్యాధిపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తారణాధికారి.డి. సుబ్రమణ్యం కుష్టువ్యాధి ఏవిధంగా వ్యాపిస్తుంది, కుష్టువ్యాధి లక్షణాలు తదితర అంశాలను వివరించారు. వ్యాధిని మొదటిదశలో గుర్తించి చికిత్స తీసుకుంటే అంగవైకల్యాన్ని నివారించవచ్చని తెలియ జేశారు. ప్రజలందరిచే కుష్టువ్యాధిని పారదోలుదాం- కుష్టురహిత దేశంగా గుర్తింపు తెద్దాం అని ప్రతిజ్ఞ చేజయించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ప్రవీణ్ కుమార్, పి హెచ్.యెన్ బి.సుభద్రమ్మ, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ యం.యల్.హెచ్.పి/ సి.హెచ్. ఓ శ్రీలక్ష్మి ,ఆరోగ్యకార్యకర్తలు, కె.అంకెయ్య, టి.మేరీ, 104 సిబ్బంది డిఈఓ సూర్యుడు, పైలెట్.సూరి, ఆశాకార్యకర్త శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం మంజూరుపై హర్షం

విశాలాంధ్ర- వేంపల్లె: వేంపల్లె పంచాయతీ పరిధిలో రోడ్డు విస్తరణ లో భాగంగా మార్కస్ మసీదుకు చెందిన వాణి జ్య గదులకు పంబంధించి పరిహారం మంజూరుపై మసీదు కమిటీ సభ్యులు హర్షం వ్యక్తంచేశారు. ఈ పరిహారం మంజూరుకు కృషి చేసిన జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, వైకాపా మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి, ఎంపి అవినాష్ రెడ్డిలు మైనార్టీలపై ఉన్న ప్రేమను చాటుకొనేందుకు వాణిజ్య గదులకు నష్ట పరిహారం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.. మైనార్టీ ప్రజలు అందరూ సిఎం జగన్ ను మరిచి పోరన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ షబ్బీర్ వలి, హజ్ హౌస్ డైరెక్టర్ మునీర్, షాదీఖాన్ కమిటీ ఛైర్మన్ షేక్షావలి, మసీదు కమిటి ఛైర్మన్ ఆఫీస్, రఫీ, మహమ్మద్ గౌస్, షాదీఖానా కమిటీ సభ్యులు టైల్స్ మౌల్లా, చాన్ బాష, మాజీ కొఆప్షన్ మెంబర్ సాదక్ వలి నాయకులు, మసీదు ఇమాములు పాల్గొన్నారు.

గృహ నిర్మాణంపై సమీక్ష

విశాలాంధ్ర-లింగాల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున గృహ నిర్మాణంపై క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు జగనన్న గృహ నిర్మాణం చేపట్టిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు గడువులోపు నిర్మాణాలు పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. లబ్దిదారులతో సమన్వయం చేసుకుంటూ గృహ నిర్మాణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

టైక్వాండో పోటీలలో పీస్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : తిరుపతిలో ఈనెల 11, 12 తేదీలలో నిర్వహించిన 1వ ఓపెన్ సౌత్ జోన్ టైక్వాండో ఛాంపియన్ షిప్ 2023లో పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారని డైరెక్టర్ సయ్యద్ గౌస్ పీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా పోటీలో 4 గోల్డ్ మెడల్స్, 3 సిల్వర్ మెడల్స్ సాధించారని తెలిపారు. షేక్ నూర్‌బాషా, షేక్ ఇబ్రహీం 4వ తరగతి, షేక్. మహమ్మద్ రిహన్ 9వ తరగతి, మహమ్మద్ అలీఖాన్ 8వ తరగతి గోల్డ్ మెడల్స్ సాధించారని చెప్పారు. షేక్. ఫర్హాన్, షేక్. ఖాజా మోహినూద్దీన్, సయ్యద్. మహమ్మద్ ఫర్హాన్ 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు సిల్వర్ మెడల్ సాధించాలని తెలిపారు. మన్సూర్ కరాటే మాస్టర్ మన్సూర్‌ను పీస్ స్కూల్ డైరెక్టర్ సయ్యద్ గౌస్ పీర్ అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

విశాలాంధ్ర-యర్రగుంట్ల : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవడం ద్వారా తమ ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల (పీహెచ్‌సీ) వైద్యులు నాగార్జున, జ్యోత్స్న పేర్కొన్నారు. సోమవారం వీరు స్థానిక రాణివనం ప్రాంతంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు ఆరోగ్య సమస్యలపై పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వలన వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, పీహెచ్ఎన్ వరదమ్మతో పాటు జయపాల్, రాజి తదితరులు పాల్గొన్నారు.

టైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - మైదుకూరు : ఫిబ్రవరి 11, 12 వ తారీకుల లో టెంపుల్ ఆఫ్ టైక్వాండో వారు తిరుపతిలో నిర్వ హించినటువంటి ఫస్ట్ సౌత్ జోన్ టైక్వాండో ఛాంపియన్ షిప్ మైదుకూరు టైక్వాండో క్లబ్ మాస్టర్ జిలాని భాష ఆధ్వర్యంలో 41 మంది క్రీడాకారులను తిరుపతికి తీసుకు వెళ్లడం జరిగింది. ఇందులో భాగంగా టైక్వాండో మాస్టర్ జిలాని బాషా మాట్లాడుతూ 41 మందిలో (గర్ల్స్ 17) (బాయ్స్ 24) మంది గాను 20 బంగారు పతకాలు 15 వెండి పతకాలు మరియు కంచు పతకాలు సాధించడం జరిగింది.వీరికి శిక్షకులుగా లేడీ సీనియర్ సాగర్ ఝాన్సీ అలాగే బాలాజీ గర్ల్స్ ఉన్నారని తెలిపారు. అలాగే ఈ మధ్యకాలంలో జరిగేటటువంటి అత్యాచారా లకు మహిళలు చాలా తీవ్రంగా గురవుతున్నారు కావున ఇలాంటి క్రీడలు వారి కై వారే ఇలాంటి ప్రమాదాల నుంచి కాపాడుకుంటారని, కావున ప్రతి ఒక్క అమ్మాయి తల్లిదండ్రులు ఆలోచించవలెను అలాగే ఈ ఫస్ట్ సౌత్ జోన్ టైక్వాండో పోటీలకు మా వెంట ఈ క్రీడా ను ప్రోత్సహించి క్రీడాకారులను పంపించినటువంటి తల్లిదండ్రులకు ధన్యవాదములు తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

విశాలాంధ్ర-పులివెందుల: స్థానిక పూలంగళ్ల వద్ద ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా పులివెందుల పట్టణానికి చెందిన శ్రీరాజా కళానిలయం డ్యాన్స్ మాస్టర్ రాజా ఆధ్వర్యంలో జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి స్నేహితఅమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు వ్యాఖ్యతగా వ్యవహరించారు. సోమవారం రాత్రికి రంగస్థల నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బహుశా సోమవారంతో రంగాథ స్వామి బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు వారు వెల్లడించారు. కార్యక్ర మాలను విజయవంతం చేసినందుకు వారు అభినందనలు తెలిపారు.

విశాలాంధ్ర

అన్నమయ్య జిల్లా

ఆకేపాడులో పశువైద్య సేవలు

కదిలించిన 'విశాలాంధ్ర' కథనం

నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం.. పశు వైద్య శాఖ.!

విశాలాంధ్ర -రాజంపేట: మండల కేంద్రంలోని ఆకేపాడు గ్రామ పంచాయతీలో గత ఆరు నెలలుగా గొర్రెలు, మేకలు పారుడు వ్యాధితో మృత్యువాత చెందుతున్నాయని సోమవారం విశాలాంధ్ర దినపత్రికలో నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం పశువైద్యశాఖ అనే కథనం వెలువడింది. ఈ కథనానికి స్పందించిన పశు వైద్య అధికారులు వెంటనే కమ్మపల్లి,అచ్చన పల్లి,శ్రీ రంగరాజపురం, హరిజనవాడ తదితర ప్రాంతాలలో పర్యవేక్షించి పశువులకు వైద్య సేవలు అందించారు. అనంతరం పశువుల యజమానులకు పారుడు వ్యాధికి సంబంధించి సూచనలు సలహాలు అందజేశారు. మేకలు, గొర్రెలు, పశువులు అనారోగ్యాలకు గురైనప్పుడు వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే సత్వరమే వైద్య సేవలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పశుసంచార వాహన వైద్యుడు శ్రావణ్ కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ పూజ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

మిట్స్‌లో ఘనంగా రేడియో దినోత్సవం

విశాలాంధ్ర-మదనపల్లె రూరల్:మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, మదనపల్లె కళాశాల నందు ప్రపంచ రేడియో దినోత్సవాన్ని ఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమం లో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్ మాట్లాడుతూ రేడియో ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించేందుకు ఫిబ్రవరి 13న ప్రపంచ రేడియో దినోత్సవాన్ని జరుపుకుంటారు అని, అనేక దేశాలలో, ఇది సమాచారాన్ని అందించడానికి ప్రాథమిక మూలం అని విద్యార్థులతో అన్నారు. మాస్ మీడియా రంగం తొలుత ప్రింట్ మీడియంతో ప్రారంభమైంది. చాలా ఏళ్లు ప్రింట్ మీడియా ద్వారానే వార్తలు తెలిసేవి. టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న కొద్దీ, శాస్త్రవేత్తలు ధ్వని తరంగాల ద్వారా వార్తలను ప్రసారం చేయడం ప్రారంభించారు. అధునాతన సాంకేతికతతో దూసుకుపోతున్న ఆధునిక యుగంలోను రేడియో తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ముఖ్యంగా కరోనా సంక్షోభం సమయంలో ఎన్నో నకిలీ వార్తలు ఇంటర్నెట్లో వివరించగా.. రేడియోలో విశ్వసనీయమైన వార్తలను మాత్రమే ప్రసారం చేశాయి. దీనితో పాటు ప్రస్తుతం కమ్యూనిటీ రేడియో వ్యవస్థ కూడా ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆదరణ పొందింది అని అన్నారు. అతి త్వరలో ఈ కమ్యూనిటీ రేడియో ను మిట్స్ కళాశాల లో ఘనంగా ప్రారంభిస్తున్నాము అని కూడా ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో రేడియో జాకీ లు, విద్యార్థులు అధ్యాపకుల పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

విశాలాంధ్ర-మదనపల్లి రూరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మొటుకు రమణ,బాబు బెల్లం శ్రీనివాసులు డిమాండ్ చేశారు ఆ మేరకు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఒకవైపు ఇసుక లేక, కరోనా వల్ల పనులు కోల్పోయారని పేర్కొన్నారు. దాదాపు 2018 నుంచి పెండింగ్లో ఉన్న క్లైమ్స్ పరిష్కరించాలని డిమాండ్ చేశారు . కార్మికుల సెస్సు వాడుకునే హక్కు ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చంద్రన్న బీమాకు తరలించి కార్మికుల చేతిలో చావు దెబ్బతిన్నాడని చెప్పారు. జగన్ ప్రభుత

ప్రవేట్ మెడికల్ క్లినిక్కుల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర-కెవిపల్లి: కంభంవారి పల్లి మండలం గర్నిమిట్ట గ్రామము నందు గల ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్ క్లినిక్కులను గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధి కారి డాక్టర్ శ్యామల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె క్లినిక్కుల నిర్వాహకులతో మాట్లాడుతూ ప్రాక్టీస్ చేసే ప్రతి ఒక్కరు ఖచ్చితంగా క్లినిక్ నేమ్ బోర్డు ఏర్పాటు చేయాలని, బోర్డు నందు 'ప్రథమ చికిత్స కేంద్రము' అని మాత్రమే నమోదు చేయాలని, ప్రాక్టీస్ చేసే వారి పేరు ఎదురుగా డాక్టర్ అనే పదం వాడరాదని సూచించారు. క్లినిక్ నందు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, వ్యాధులు రాకుండా సలహాలు సూచనలు అందజేసి మిగతా వారిని ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాలని సూచించారు. క్లినిక్కుల నందు బెడ్స్ ఏర్పాటు చేయడం, ఐ.వి. ఫ్లూయిడ్స్ ఎక్కించడము, స్టెరాయిడ్లు, మత్తుమందులు, యాంటీబయోటిక్స్ ఇంజక్షన్ వేయడం చేయరాదన్నారు. అనధికారికంగా మందులు అమ్మడం, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయటం కాని, వాటిని సూచించడం కాని చేయరాదన్నరు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన యెడల ఖచ్చితంగా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ రేష్మ, ఆరోగ్య విస్తరణ అధికారులు కృష్ణమ్మ, కృష్ణయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు పురుషోత్తం, చెన్నమ్మ, ఆశా రెడ్డి లక్ష్మి పాల్గొన్నారు.

నీటి సంరక్షణపై అవగాహన కల్పించండి

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : గ్రామాలలో నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఆర్‌డబ్ల్యుఎస్‌డిఈ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. జల సంజీవని మిషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంపీడీవో సభా భవనంలో జల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఈ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 2024 నాటికి ప్రతి ఒక్కరికి మంచినీటి కులాల ద్వారా 55 లీటర్ల నీటిని అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యం అన్నారు. జల సంజీవన్ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. విడబ్ల్యూఎస్‌వి కమిటీలు ఏర్పాటు చేసి కమిటీలు ద్వారా అందిస్తామని ఆయన అన్నారు. ఎఫ్‌టికే నీటిని పరీక్షించే పని పైన ఉన్న యూనిట్లు మహిళ సంఘాలు కలిసి గ్రామంలోని నీటి సమస్య వారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. నీటిని టెస్ట్ ద్వారా పరీక్షలు నిర్వహించి ఆ గ్రామంలోని మంచినీటి శాతాన్ని గుర్తించి అవసరమైనంతవరకు మంచినీరు అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్ కుమార్, టిటిఎం కులాయప్ప, నీటి పరిరక్షణ అధికారి పెంచల్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు అభ్యసన అభివృద్ధిపై శిక్షణ

విశాలాంధ్ర-చిట్వేలి : స్థానిక మండల ప్రాథమిక పాఠశాల మెయిన్ నందు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు పదోన్నతిపై వచ్చిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారి మహేశ్వరరావు ఆధ్వర్యంలో అభ్యసన అభివృద్ధి శిక్షణను సోమవారం ఇవ్వడం జరిగిందని జిల్లా రిసోర్స్‌పర్సన్‌లు పసుపుల రాజశేఖర్, హరినాథ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి మహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమం అమలయేలా చూడాలన్నారు. అనంతరం జిల్లా రిసోర్స్ పర్సన్‌లు పసుపుల రాజశేఖర్, హరినాథ్ మాట్లాడుతూ మౌలికభాష సామర్థ్యాలైనా మాట్లాడటం, చదవడం, రాయడం, అవగాహన చేసుకోవడం వంటి నైపుణ్యాలను, గణితములో చతుర్విధ ప్రక్రియలు, ప్రతి సబ్జెక్టులో నిర్దేశించిన అభ్యసినా ఫలితాలు సాధించేలా పియర్ గ్రూప్‌ల, తల్లిదండ్రుల, కమ్యూనిటీ భాగస్వామ్యంతో పిల్లల ప్రగతికి ప్రతి ఉపాధ్యాయుడు తోడ్పడాలన్నారు. అభ్యసన అభివృద్ధి కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తేనే విద్యార్థి అభ్యసనా అభివృద్ధిని మెరుగుపరిచిన వారిగా ఉంటామన్నారు. ప్రతి ఉపాధ్యాయుని ఉపాధ్యాయుడు పాఠ్యప్రణాళిక, డైరీ, కేసు స్టడీ, వెనుకబడిన విద్యార్థుల జాబితా వారి అభివృద్ధికి దోహదపడే కృత్యాలు మొదలగునవి ఏరోజుకారోజు సిద్ధము చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవ పోస్టర్‌లు ఆవిష్కరించిన ఇంచార్జ్ కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:ఫిబ్రవరి 13 నుండి 17వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ తమీమ్ అన్సారీయ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో ఇన్చార్జి కలెక్టర్ తమీమ్ అన్సారీయ, ఆర్థిక అక్షరాస్యత వారోత్సవ అవగాహన పోస్టర్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2016 నుండి ప్రతి సంవత్సరం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. దీంతో దేశవ్యాప్తంగా ప్రపంచంలో వివిధ అంశాలపై ఆర్థిక విద్యా సందేశాలను ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. ఈ ఏడాదికి గాను ఆర్బిఐ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకులవారు ఫిబ్రవరి 13 నుండి 17 వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తారన్నారు. ఇందులో ముఖ్యంగా డిజిటల్ లావాదేవీలు సౌలభ్యం గురించి అవగాహన, డిజిటల్ లావాదేవీల భద్రత, కష్టమర్ల రక్షణ మరియు వచ్చిన ఆదాయాన్ని ఏ విధంగా ప్రజలు ఖర్చు మరియు పొదుపు గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని బ్యాంకు లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ సత్యనారాయణ, ల్యాండ్ అండ్ సర్వే ఏడి జయరాజు, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ టి సి ఆస్తులను గుత్తకిస్తే అడ్డుకుంటాం:సిపిఐ

టెండర్లను అడ్డుకుంటాం -ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసుకొంది ఆస్థులు అమ్మడానికా

విశాలాంధ్ర-మదనపల్లె రూరల్:ఆర్టీసి ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో మదనపల్లి ఆర్ టి సి రెండవ డిపో ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి క్రిష్ణప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి సమస్తను ప్రభుత్వంలో విలీనం చేసుకొని ఆర్‌టిసి రంగాన్ని అభివృద్ధి చేస్తుందనుకొంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసికి ఉన్న ఆస్థులు అన్ని ఒక్కొకటే గుత్తల పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే కార్యక్రమం చేపడుతుందన్నారు. ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనం ఐన తర్వాత ఒక్క ప్రభుత్వ ఉద్యోగిని బర్తి చేసిన పరిస్థితి లేదన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు మనోహర్ రెడ్డి,సాంబ శివ మాట్లాడుతూ మదనపల్లి ఆర్‌టిసి బస్టాండ్ 1975లో ఏర్పాటు చేశారని,12 ఎకరాలకు పైగా ఉందని ప్రతి నెలా ఆర్టీసి డిపోకు 13 లక్షల రూపాయలు అద్దెలు వస్తున్నా యని, పట్టణానికి మధ్యలో వందల కోట్లు విలువ చేసే ఆస్తులు ఇప్పుడు అప్పనంగా గుత్తల పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తున్నారని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ఏ ప్రభుత్వ రంగసంస్థలను ఉండనివ్వదన్నారు. ప్రభుత్వ ఆస్తులన్నీ తమ నవరత్నాల పథకాల కోసం అమ్ముకొంటారని వాపోయారు. నియోజక వర్గ కార్యదర్శి కె మురళి మాట్లాడుతూ మదనపల్లి ఆర్ టి సి ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడానికి నిర్వహించే టెండర్లను సిపిఐ పార్టీగా అడ్డుకుంటామని, పబ్లిక్ ప్రాపర్టీని గుత్తలకు ఇవ్వడానికి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడానికేన ఆర్‌టిసిని విలీనం చేసుకోనుంది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత పతకాలకోసం ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడం, అమ్మడం సరైనది కాదన్నారు. టెండర్లను జరపలనుకొంటే జరగనివ్వనని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ నాయకులు, సిద్దన్న,దేవా,తిరుమల, మోహన్ ,రెడ్డి, రెడ్డమ్మ, అనసూయ,శోభ నవీన్ సలీమ్, తంబయ్య శెట్టి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మండల కేంద్రంలోని హెచ్‌ఎంఎం హైస్కూల్లో చదివిన పూర్వపు విద్యార్థిని విద్యార్థులు 40 సంవత్సరాల తరువాత 13 ఫిబ్రవరి 2023న సోమవారం 113 మంది విద్యార్థులు కలుసుకున్నారు. కుశల ప్రశ్నలు వేసుకున్నారు. అలనాటి తరగతి గదిలో ముచ్చట్లు చెప్పుకోవడంతో వారిలో సంతోషం పెల్లుబికింది. పాత జ్ఞాపకాలను మనోఫలకంపై మరోసారి గుర్తుకు తెచ్చుకున్నారు. గురువులకు ఘనంగా సత్కరించి వందనాలు చేసి ఆశీర్వాదాలు అందుకున్నారు. స్నేహితుల మధ్య ఉన్న భారతీయ సాంప్రదాయాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. పూర్వపు విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని సంతోషంగా గడిపారు. ఈ బ్యాచ్‌లో రాజకీయ నాయకులుగా, డాక్టర్లుగా, వ్యాపారవేత్తలుగా, న్యాయ వాదులు గా, ఉపాధ్యాయులుగా, ఇంజనీర్లుగా, సాఫ్ట్‌వేర్ తదితర రంగాలలో పేరు పొందారు. చదువుకున్న స్కూల్ అభివృద్ధికి పది లక్షల రూపాయలు ఇవ్వాలనుకున్నారు. గత విద్యార్థులంతా కలవాలని భావించి అందుబాటులో ఉన్న స్నేహితుల ద్వారా ఫోన్ నెంబర్లు సంపాదించి అందరికీ ఫోన్ చేసి సమావేశ పరచడం మరువలేని కృషి, మిత్రులను చూడటం అందరూ మధురానుభూతులకు లోన్ చేసింది. స్టేజి పైన స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం అంటూ డాన్సులు వేసి ఆకట్టుకున్నారు. పసందైన విందు ఏర్పాటు చేశారు. మాచినేని విశ్వేశ్వర్ నాయుడు, తాతంశెట్టి నాగేంద్ర, చింతల రవీంద్ర, సిద్ధిలింగం మధుసూదన్, చెన్నంశెట్టి రమేష్ బాబు, కొండూరు ఏలియా రాజు, గోపికృష్ణ, సతీష్ బాబు, మల్లికార్జున, కోటేశ్వర రాజు, నాగేశ్వర రావు, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి మదనమోహన్ రెడ్డిని గెలిపించాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: పశ్చిమ రాయల సీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బండ్లపల్లి మదనమోహన్ రెడ్డి ని ఎమ్మెల్సీ ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీచర్స్ ఫౌండేషన్ కమ్యూనిటీ సభ్యుడు వినయ్ కుమార్ కోరారు. సోమవారం రాయచోటి ప్రాంతంలోనైనా ప్రాంతాలలో వినయ్ కుమార్ పర్యటించి మధన్ మోహన్ రెడ్డి కి మద్దతు ఇచ్చి గెలిపించాలని పలువురు ఉపాధ్యాయులను కోరినట్లు తెలిపారు. మీ హక్కులను ప్రశ్నించకుండా, కౌన్సిల్లో మాట్లాడకుండా, ప్రభుత్వంతో పోరాటం చేయకుండా రాజీ అయ్యి పార్టీ కండువాలు కప్పుకొని పార్టికలతో కుమ్మక్కైన వారు పోటీ చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో అక్రమ పద్ధతుల్లో పదివేల ఓట్లను నమోదు చేసి గెలవాలని ప్రయత్నం చేస్తున్నారు. హక్కుల కోసం పోరా దే మదన్ మోహన్ రెడ్డికి మద్దతు ఇచ్చి గెలిపించండి అని కోరారు. మధన్ మోహన్ రెడ్డి మీ హక్కులను కాపాడు తారని తెలిపారు. ఈకార్యక్రమంలోజైడ్,సాయికుమార్,రమేష్‌ాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులుగా శ్రీనివాస్ రాజు

విశాలాంధ్ర- రాయచోటిటౌన్: రాయచోటి పట్టణంలోని స్థానిక నేతాజీ సర్కిల్ వద్దగల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులుగా కొండూరు శ్రీనివాసరాజు నియామకమయ్యారు. ఈ పాఠశా లలో పనిచేస్తూ ఉన్న ప్రధానోపాధ్యా యులు చంద్రశేఖర్ సస్పెన్షన్ కు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఇదే పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నటు వంటి కొండూ రు శ్రీనివాసరాజును ప్రధానోపాధ్యాయులుగా నియమిస్తూ డిఈవో రాఘవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను డిఈవో చేతుల మీదుగా డిఈవో కార్యాలయంలో సోమవారం సాయంకాలం ఆయన అందుకున్నారు.

సౌత్ జోన్ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ

క్రీడాకారులను అభినందించిన గ్రాండ్ మాస్టర్

విశాలాంధ్ర - రాజంపేట: ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తూ అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. ఆదివారం తిరుపతి నగరంలో విశ్వం హై స్కూల్లో నిర్వహించిన సౌత్ జోన్ జాతీయస్థాయి టైక్వాండో పోటీలలో రాజంపేట పట్టణానికి చెందిన ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో సత్తా చాటారని గ్రాండ్ మాస్టర్ బి.సునీల్ తెలియజేశారు. సోమవారం స్థానిక జిఎంసి ప్రాంగణంలోని ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించి వారికి పతకాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ సునీల్ మాట్లాడుతూ అకాడమీ నుంచి 19 మంది క్రీడాకారులు పోటీలలో పాల్గొనగా అద్భుత ప్రదర్శనతో అందరూ పతకాలు సాధించారన్నారు. 4 స్వర్ణ పతకాలు 4 రజతం, 11 కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. తన శిక్షణలో అనేకమంది క్రీడాకారులు స్పోర్ట్స్ కోటా ద్వారా ఉన్నత చదువులకు సీటు పొందారని, ప్రభుత్వ ఉద్యోగాలను పొంది స్థిరపడ్డారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు పెద్దపీట వేసిందని అవకాశాలను వినియోగించుకుని యువత క్రీడలలో రాణించాలని అన్నారు. మార్షల్ ఆర్ట్స్ ద్వారా ఆరోగ్యము, శారీరక దారుఢ్యము, మానసిక వికాసం తో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందించుకుని ఆత్మరక్షణ పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ఉపాధ్యక్షులు బచోటి భాస్కర్, ప్రధాన కార్యదర్శి చౌడవరం నరసింహులు, సంయుక్త కార్యదర్శులు ఉమాశంకర్, వి.నరసింహులు, మాస్టర్లు టీ.చంద్రశేఖర్, కే.నాగరాజ, కే.గంగా రామ్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గాలివీడు:మండలములో సీనియర్ పాత్రికేయులుగా పనిచేసిన పూజారి నాగేశ్వర రావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్ రెడ్డి సోమవారం పులుకుంట గ్రామము బోరెడ్డిగారిపల్లెలోని పూజారి నాగేశ్వర రావు స్వగృహంలో ఆయన్ను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకొన్నారు.ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందచేశారు.అనంతరం పూజారి నాగేశ్వరరావు త్వరగా కోలుకోవాలని మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్ రెడ్డి ఆకాంక్షించారు.

వధూవరులను ఆశీర్వదించిన అజయ్ రెడ్డి

విశాలాంధ్ర - సుండుపల్లి : మండల కేంద్రంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు జహీర్ కూతురి వివాహ వేడుకలకు రాజంపేట నియోజక వర్గ వైకాపా నాయకుడు యర్రపురెడ్డి అజయ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిక్క వేడుకల్లో పాల్గొని పెళ్లి కుమారుని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ అజంతమ్మ, మైనార్టీ నాయకులు రహీంభాష, కో ఆప్షన్ నెంబర్ ఖలీమ్‌భాష, ఖాదర్‌బాషా, సయ్యద్ మస్తాన్, పలువురు వైకాపా నాయకులు, తెలుగుదేశం నాయకులు శివరాం నాయుడు, చంద్రశేఖర్ రాజు, దొరస్వామి నాయుడు పాల్గొన్నారు.

కేసులు పునరావృతమైతే పిడి యాక్ట్ : ఎస్ఐ

విశాలాంధ్ర-సుండుపల్లె : ఎర్రచందనం, నాటు సారా తయారీ, విక్రయాల కేసులు పునరావృతమైతే పిడి యాక్ట్ కేసులు నమోదు చేయాల్సి వస్తుందని సుండుపల్లె ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. సోమవారం సుండుపల్లె పోలీసులతో కలిసి మండల పరిధిలోని మాచిరెడ్డిగారిపల్లి పంచాయతి గ్రామంలో వివిధ కేసులలో నిందితులుగా ఉన్న వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇప్పటివరకు ఎర్రచందనం, నాటు సారా తయారీ, విక్రయాలపై దృష్టి పెడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సూచించారు.

పేద కుటుంబానికి నిత్యవసర వస్తువుల అందజేత

విశాలాంధ్ర -రాజంపేట: ఆపదలో ఉన్నటువంటి నిరు పేద కుటుంబాలను ఆదుకు నేందుకు వాసవి సహృదయ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరంతర సేవా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని ట్రస్ట్ అధ్యక్షుడు శరత్ బాబు పేర్కొన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో భవాని నగర్ కు చెందిన పేద కుటుంబానికి నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి జీవనాధారం లేని నిరుపేద కుటుంబాలను ఆదుకునేందుకు తమ వంతు లక్ష్యంగా సేవా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

విశాలాంధ్ర-రామసముద్రం: వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది మండలంలోని కురిజల గ్రామానికి చెందిన వెంకట మునెమ్మ రోజు విధంగానే తన గొర్రెలను గొర్రెల దొడ్డిలోకి తోలింది అయితే ఆదివారం రాత్రి వీధి కుక్కలు గొర్రెల మందపై పడి 20 గొర్రెలపై దాడి చేసి చంపేశాయి లక్ష రూపాయలకు పైగా విలువ చేసే గొర్రెలుమృతి చెందడంతో వెంకట మునెమ్మ కన్నీటి పర్యంతమైంది గొర్రెలు మేపి జీవనం సాగించే తనకు వేరే ఆధారం లేదని తెలిపింది ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని వేడు కొంటోంది

లారీని ఢీకొన్న ప్రయివేట్ అంబులెన్స్

- నలుగురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-పీలేరు: లారీని వెనుకవైపు నుంచి అంబులెన్స్ ఢీకొన్న ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డ సంఘటన స్థానిక కడప మార్గంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. రాయచోటికి చెందిన గులాబి జాన్ (45) .. రహతా జాన్ (45),మోబీనా (24), ప్రయివేట్ అంబులెన్స్లో రాయచోటి నుంచి తిరుపతికి ఆస్పత్రికి వెళ్లడానికి బయలుదేరారు. అయితే వెంకటాద్రి ఇళ్ల వద్ద వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో కర్నూలు జిల్లా బనగానపల్లె నుంచి తమిళనాడుకు వెళ్లుతున్న లారీని అంబులెన్స్ ఓవర్టేక్ చేయబోయాడు. అయితే ఎదురుగా మరో వాహనం వస్తుండడంతో ముందువెళుతున్నలారీని ఢీకొన్నాడు. అంబులెన్స్ డ్రైవర్ సమీవుల్లా (27) తోపాటు, గులాబ్జాన్, రహతా జాన్, ముభీనా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫెర్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ నరసింహుడు తెలిపారు.

కూచిపూడి నృత్య ప్రదర్శనలో హరిత ప్రతిభ

విశాలాంధ్ర-పీలేరు: కూచిపూడి నృత్య ప్రదర్శనలో హరిత తన ప్రతిభను చాటుకుంది. పీలేరు కు చెందిన శ్రీ నటరాజ కళామందిర నిర్వాహకురాలు పాలగిరి హరిత తిరుపతి శిల్పారామంలో వే ఫౌండేషన్స్ వారు భారతీయ సాంస్కృతిక ఉత్సవ కార్యక్రమంని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో అత్యంత ప్రతిభను హరిత కనబరిచారు.వీరి ప్రతిభ ను గుర్తుంచిన వే పునాదులు అధ్యక్షులు అంకయ్య చేత ప్రతిభా పురస్కారం ప్రశంశ పత్రం తో సత్కరించటం జరిగింది.

బిసి నాయకుని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-రామాపురం : మండలముకు నల్లగుట్టపల్లె గ్రామము బి. రాచపల్లెకు చెందిన బిసి సీనియర్ నాయకుడు మేర నాగన్న గత కొన్ని రోజులుగా అనారోగ్యం బాధపడుతూ బెంగళూరు నగరంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్ రెడ్డి ఆయనను ఫోన్‌లో సోమవారం పరామర్శించారు. అనంతరం ఆసుపత్రి ఖర్చులకు ఆర్థిక సహాయము అందచేసి అండగా ఉంటాను అని భరోసా కల్పించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-చిట్వేలి : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ ఓటర్లను కలసి ఎమ్మెల్సీ ఎన్నికల లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కత్తి నర్సింహారెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోతుల నాగరాజుని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని చిట్వేలి మండలంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పివెల్ నరసింహులు, సహాయ కార్యదర్శి పి మహేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం శివరామకృష్ణదేవరా మండల సహాయ కార్యదర్శి సామా గంగయ్యలు ప్రచారం నిర్వహించారు.

ఓటర్ లిస్టును పరిశీలించి న్యాయం చేయండి

విశాలాంధ్ర- నందలూరు :: రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్ కలిసి ఓటర్ లిస్టు ప్రకారం ఉన్న మార్పులు, చేర్పులపై వివరించి సంబంధిత రుజువులను ఆయనకు అందజేసి వాటిని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సోమవారం పసుపులేటి ప్రవీణ్ మాట్లాడుతూ 2022వ సంవత్సరం ఓటర్ లిస్టును మండల టిడిపి నేతల ద్వారా పూర్తిగా పరిశీలన చేయించి చనిపోయిన, డబల్ ఎంట్రీ, ఊరు వదిలి వెళ్ళిపోయిన వారివి ఓట్లను గుర్తించి వాటిని సంబంధిత మండల తహసిల్దార్ ఉదయ శంకర్ రాజుకు ఓటరు దరఖాస్తు పత్రం-7, కొత్త ఓటర్లని దరఖాస్తు- 6 ద్వారా పొందుపరిచి అందజేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండు ఖాళీ స్థలాలు లీజుకి ఇవ్వాలనే నిర్ణయం శోచనీయం

విశాలాంధ్ర-మదనపల్లి రూరల్: జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ రంగ ఆస్తులను పెంచకపోగా ప్రభుత్వ ఆస్తులన్నింటినీ అమ్మడమో లేక లీజుకి ఇవ్వడమో చేసి భవిష్యత్తులో ప్రజలకి ఎలాంటి ఆస్తులు లేకుండా చేయడానికి కుట్ర చేస్తున్నాడని మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నవీన్ చౌదరి, నాదెళ్ల రామచంద్ర నాయుడు, కత్తి రామ్మూర్తి, ఆవుల రెడ్డప్ప నాయుడు పేర్కొన్నారు. సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికైన ప్రభుత్వం కేవలం ఐదు సంవత్సరాల కాల పరిమితితో ఉంటుంది కానీ ఆర్టీసీ బస్టాండ్ స్థలాలను 33 సంవత్సరాలు పాటు ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇవ్వాలని 14వ తేదీ టెండర్లు పిలవడం దారుణమైన విషయం ప్రజల భవిష్యత్తును జగన్మోహన్ రెడ్డి తాకట్టు పెట్టి రాబోయే రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఆస్తులు లేకుండా చేస్తున్నాడు ఇలాగే మద్యం మీద వచ్చే ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టాడు విశాఖపట్నంలో ఆదాయం సమకూర్చుకోవడానికి కలెక్టరేట్ ఆఫీస్ తాసిల్దార్ ఆఫీస్ను తాకట్టు పెట్టారని, ఆయనే ముఖ్యమంత్రిగా కొనసాగితే రాబోయే రోజుల్లో ప్రభుత్వాసులనేటివి ఏమీ లేకుండా చేస్తారని ప్రజలు ఆలోచించి రాబోయే ఎన్నికలలో జగన్మోహన్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలని ఆర్టీసీ బస్టాండ్ స్థలాలను వేలం వేయడాన్ని వెంటనే విరమించుకుని ప్రభుత్వ రంగ ఆస్తులను అలాగే కొనసాగించాలని కోరుతున్నామన్నారు.

గొంతు కోసుకుని మహిళ ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-మదనపల్లి: కడుపునొప్పి తాళలేక గొంతు కోసుకొని ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బి కొత్తకోట మండలంలో సోమవారం చోటు చేసుకున్న ఘటనపై మదనపల్లి జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు, బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు.. బి కొత్తకోట మండలం, కోట ఊరు పంచాయతీ, ఎర్రమద్ది వారి పల్లి కు చెందిన మధుసూదన్ రెడ్డి భార్య వై మంజుల 40, కడుపునొప్పి తీవ్రతరం కావడంతో మనస్థాపం చెంది వంట ఇంట్లో ఉన్న కత్తితో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు ఆమెను చికిత్స నిమిత్తం 108 వాహనంలో హుటాహుటిన మదనపల్లి జిల్లా ప్రభుత్వా సుపత్రికి తరలించారు. విభాగం వైద్యులు ఆమెకు మెరుగైన వైద్య చికిత్సలు అందించడంతో ఆసుపత్రిలో కోలుకుంటోంది.

బైకును టాటా ఏసీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర- మదనపల్లి: బైకును టాటా ఏస్ వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ సంఘటన సోమవారం రాత్రి రామసముద్రం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. పుంగనూరుకు చెందిన వెంకటరెడ్డి కుమారుడు మునిశేఖర్ రెడ్డి 55 సొంత పనిమీద బైకులో సోమయాజినపల్లి కి వెళ్ళాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా, మార్గమధ్యంలోని రామసముద్రం మండలం, ఎరపల్లి క్రాస్ వద్ద బైకును ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికల సాయంతో 108 సిబ్బంది బాధితులని చికిత్స నిమిత్తం హుటా హుటిన మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. ఆస్పత్రి అత్యవసరంభాగం వైద్యులకు పరీక్షించి వైద్యం అందించిన ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి వెళ్లాలని సూచించారు. ఘటనపై రామసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవిచంద్ర తెలిపారు.

కలికిరి రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సామాజిక సేవ

విశాలాంధ్ర-పీలేరు : రెడ్డి సంక్షేమ సంఘము కలికిరి వారు యోగివేమన జయంతి సందర్భంగాఈ నెల 17న 1నుండి 5 తరగతి వరకు, 6 నుండి 10 తరగతి విద్యార్థినీ విద్యార్థులకు వేమన కంఠస్థ పద్య పోటీలు, రెండు (ప్రైమరీ, సెకండరీ) విభాగాలలో నిర్వహించాలని నిర్ణయించారని రెడ్డి సంక్షేమ సంఘము వారు తెలిపినారు ఈ కార్యక్రమం ఫిబ్రవరి17 శుక్రవారం ఉదయం 10 గంటలకు కలికిరి(తెలుగు) మండల ప్రజా పరిషత్ పాఠశాలనందు నిర్వహించబడును.రెండు విభాగాలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.5000, రెండవ బహుమతిగా రూ.3000, మూడవ బహుమతిగా రూ.2000 తో పాటు మెడల్ , సర్టిఫికెట్ ఇవ్వబడును బహుమతి ప్రధానం వేమన జయంతి సందర్భముగా 19.02.2023 న ఉదయం 10 గంటలకుధరణి హెూటల్ సమీపంలోని ఎన్ ఎస్ కళ్యాణమండపం నందు జరుగును విద్యార్థినీ విద్యార్థులు పద్యాలతో పాటు భావం కూడా వివరించవలసి ఉంటుంది. బహుమతులతో పాటు అర్హులైన వారికి కన్సోలేషన్ బహుమతులు కూడా కలవు. వారు కూడా మెడల్, మొమెంటులతో పాటు సర్టిఫికెట్ పొందుతారు. పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇవ్వబడును. పోటీలలో పాల్గొను విద్యార్థులు తమ పేర్లను గురువారంలోగా ఈ ఫోను నెంబర్ల ద్వారా 9110331495 ,9966465949, 8978835845 తెలియజేసి నమోదు చేసుకోవాలన్నారు.

బాలాజీ నగర్ గ్రామ వాసులకు స్థానిక భూమిని ఇంటి స్థలాలకు ఊరు అవసరాలకు కేటాయించాలి

- అన్నమయ్య జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు అధికారులకు విజ్ఞప్తి

విశాలాంధ్ర-చిట్వేలి : చిట్వేలు మండలం ఎమ్మార్వో కార్యాలయం నందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మార్వోతో బాలాజీ కాలనీ సమస్య గురించి చర్చించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పిఎల్ నరసింహులు జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ మహేష్ మాట్లాడుతూ చిట్వేల్ మండలం కంపసముద్రం పంచాయతీ బాలాజీ నగర్ దళితవాడ గ్రామం ప్రక్కన సర్వే నంబర్ 393-ఎలో 2 ఎకరాల 21 సెంట్లు భూమి పై ఎమ్మార్వోతో మాట్లాడుతూ మా భూమిని బాలాజీ నగర్ కాలనీవాసులకు ఊరు అవసరాలకు ఇంటి స్థలాలకు రాబోయే తరానికి భూమి ఎంతో అవసరమని చెప్పడం జరిగినది. ఆ భూమికి సంబంధించిన రైతుకు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం చెల్లించి ఆ భూమిని ఆ గ్రామ పరిధిలోకి కేటాయించాలని అవసరమైతే అన్నమయ్య జిల్లా కలెక్టర్ గారితో కూడా మాట్లాడి ఆ భూమిని బాలాజీ నగర్ గ్రామ వాసులకు కేటాయించాలని చిట్వేలు ఎమ్మార్వోతో చర్చించారు. ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు దేవర వ్యవసాయ కార్మిక సంఘం రైల్వే కోడూరు ఏరియా కన్వీనర్ కెశం ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం చిట్వేలి మండల కార్యదర్శి సామా గంగయ్య బాలాజీ నగర్, గ్రామ శాఖ కార్యదర్శి వెంకటసుబ్బమ్మ, సహాయ కార్యదర్శి నాగమనమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నగరంలోని యువకులకు ఉచిత డ్రైవింగ్ శిక్షణ

విశాలాంధ్ర- కమలాపురం : శ్రీ లక్ష్మీ దుర్గ టెక్నికల్ స్కూల్ నందు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నట్లు హైదరాబాద్ అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుంకు బాలచంద్ర తెలిపారు. మదర్ థెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 20 రోజులు డ్రైవింగ్ 10 రోజుల తీరి శిక్షణ తరగతులు నెలరోజులు పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చిన తర్వాత ఎల్ ఎల్ ఆర్ లైసెన్స్ సర్టిఫికెట్ అందిస్తారు. తెలిపారు ఆసక్తి ఉన్నవారు వెంటనే దరఖాస్తు చేసుకొని సంబంధిత డాక్యుమెంట్లు జతపరిచి ఇవ్వవలెనని వారు యువతీ యువకులు కోరారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, మార్కుల జాబితా, నాలుగు పాస్పోర్ట్ ఫోటోలు 19 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల్లో యువకులకు అర్హులు అని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజు 500 అభయ ఫౌండేషన్ హైదరాబాద్ వారికి చెల్లించి శిక్షణ పూర్తి అయిన తర్వాత తిరిగి ఇవ్వబడునని మదర్ తెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేస్తూ మరిన్ని విరాలకు 9160531138 , 9912418646 అనే నెంబర్ను సంప్రదించాలన్నారు.

పోరాటాల ద్వారానే విద్యార్థి హక్కులు సాధించుకోవాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంతృత్వ పోకడలకు విద్యార్థి పోరాటాల ద్వారా బుద్ధి చెప్పాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పోరాటాల ద్వారానే విద్యార్థి హక్కులు సాధించుకోవాలి అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంతృత్వ పోకడలకు విద్యార్థి పోరాటాల ద్వారా బుద్ధి చెప్పాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు గాలి చంద్రలు పేర్కొన్నారు. వైఎస్ఆర్ జిల్లాలో అఖిలభారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ప్రొద్దుటూరు కార్యాలయం నందు పవన్ అధ్యక్షతన ఏఐఎస్ఎఫ్ జిల్లా 19వ మహాసభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు గాలి చంద్రలు మాట్లాడుతూ విద్యార్థి పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కుల్ని ఈరోజు దేశంలో ప్రజాస్వామ్యం మాటున నియంతృత్వ పోకడలతో విద్యార్థి, యువజన సామాజిక, సాంస్కృతిక, చారిత్రాత్మక, మానవ మనుగడతో కూడిన జీమన ప్రయాణానికి ఆటంకం కలిగే విధంగా పాలకులు, పాలసీలు తయారు అవుతున్నాయన్నారు. విద్యారంగాన్ని సమూల మార్పులు తీసుకొని వస్తున్నారు, మార్పులన్నింటిలోనూ రాజకీయ రంగంను రుద్దుకుంటూ ఆంక్షలు విధించే విధంగా ప్రభుత్వాల పనితీరు ఎత్తిచూపారని అన్నారు. విద్యారంగంలో కూడ మతోన్మాదాన్ని ప్రేరేపితం చేసే విధంగా ఉన్న నూతన జాతీయ విద్యావిధానాన్ని బలవంతంగా విద్యార్థులపై రుద్దే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. దుర్మార్గపు ఆలోచనలతో విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలో నెట్టివేసే జీవో నెం.117ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వ మోసపూరిత ప్రగల్భాలకు అద్దుఅదుపు లేకుండా పోయిందన్నారు. నిత్యం కరువు వలసలతో అల్లాడుతున్న అట్టడుతూ ప్రాంతాల్లో పరిశ్రమలు ఎక్కడా అని సూటిగా ప్రశ్నించారు. విభజన హామీల్లో పొందుపరిచిన కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించి పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. విద్యారంగానికి ఉపాధి చేరువ చేస్తానన్న ఈ రాష్ట్ర ప్రభుత్వం మూడున్నర సంవత్సరాల పాలనలో విద్యార్థులకు ఏమి చేశారో తెలపాలన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణికి అడ్డుకట్ట వేసేది విద్యార్థులే అన్నారు. మైనార్టీ విద్యార్థినిల విద్యాభ్యాసానికి తోడ్పాటు అందించే మౌళానా ఆజాద్ స్కాలర్షిప్ రద్దును ఉపసంహరించుకోవాలన్నారు. విద్యార్థులు పోరాటాల ద్వారా హక్కులు సాధించుకోవాలని అన్నారు. పాలక ప్రభుత్వాలను పోరాటాల ద్వారా మేల్కొల్పాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.వలరాజు, జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, జిల్లా నాయకులు శరత్, లీలా, చేతన్, శివశంకర్, లక్ష్మన్తో పాటు పెద్దఎత్తున విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు అక్షరాల కలయికే ప్రేమ

నేడు ప్రేమికుల దినోత్సవం

విశాలాంధ్ర -రాజంపేట: ఎక్కడ పుడతారో తెలియదు.. ఎక్కడ పెరుగుతారో తెలియదు కాని రెండక్షరాలను కలిపే పదం జీవితాంతం వెంట నడుస్తుంది. చరిత్రను ఒకసారి తిరగేస్తే ఎంతోమంది రాజులు రెండక్షరాల పదం కోసం నేటికీ చరిత్రలో మిగిలిపోయే వాటిని నిర్మించి కానుకగా ఇచ్చారు. తరాలు మారుతున్న ఈ రెండక్షరాల బంధం ఎన్నటికీ విడదీయలేనిది. మానవ జాతికి అత్యంత విలువైంది, అవసరమైనది ప్రేమ. రెండక్షరాల పదానికి వేల అర్థాలున్నాయి. ఎవరికివారే భిన్నంగా ప్రేమను వ్యక్తపరుస్తారు. ఇవాళ ఫిబ్రవరి 14 ప్రేమికుల రోజు. ఇష్టమైన వారికి ఎదలోని భావాలను తెలియజేయడానికి అద్భుతమైన రోజు వాలెంటైన్స్ డే. ప్రేమికులు ఈరోజును ప్రత్యేకంగా భావిస్తుంటారు. మరి వాలంటైన్స్ డే విశేషాలేంటో చూద్దామా..

ప్రేమికుల రోజుగా భావించే వాలంటైన్స్ డేను సెయింట్ వాలెంటైన్స్ డే లేదా సెయింట్ వాలెంటైన్ విందు అని కూడా పిలుస్తారు. ప్రేమ, స్నేహం అభిమానాన్ని జరుపుకోవడానికి ఈ రోజు వార్షిక పండుగ. ఈ రోజు ప్రపంచం మొత్తాన్ని ఎరుపుమయంగా మారుస్తుంది.ప్రతి సంవత్సరం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేమ పక్షులు తమ ప్రత్యేక వ్యక్తులకు వివిధ రకాల బహుమతులు ఇవ్వడం, ప్రేమ మరియు ఆప్యాయత సందేశాలను పంపడం ద్వారా వారి భావాలను వ్యక్తపరుస్తాయి. ఫిబ్రవరి 14కి ముందు, ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభమయ్యే వారం మొత్తం టెడ్డీ డే, రోజ్ డే, చాక్లెట్ డే తదితర ఈవెంట్లు జరుగుతాయి.ఇది క్రీస్తుశకం 270 సంవత్సరం నాటి ఘటన. రోమ్ దేశాన్ని క్లాడియస్ చక్రవర్తి పాలిస్తున్న రోజులు. క్లాడియస్కు పెళ్లి అంటే పడదు. పెళ్లిళ్లపై నిషేధం కూడా విధించాడు. అదే సమయంలో వాలెంటైన్ అనే ఓ మతగురువు అందరికీ ప్రేమ సిద్ధాంతాన్ని బోధించేవారు. దగ్గరుండి పెళ్లిళ్లు చేయించేవాడు.

పెళ్లిళ్ల పై ద్వేషంతో నిషేధం విధించినప్పుడు కొత్తగా ప్రేమ పెళ్లిళ్లు ఎక్కువవడంతో క్లాడియస్ ఆరా తీయగా...లవ్‌గురు వాలంటైన్ వ్యవహారం కాస్తా రాజు చెవికి చేరింది. అందే ఆగ్రహంతో రాజద్రోహం ఆరోపణలపై మరణశిక్ష విధించాడు. జైళ్లో ఉండగా వాలెంటైన్ జైలు అధికారి కూతురితో ప్రేమలో పడతాడు.చనిపోయేంతవరకూ అంటే చివరి రోజైన ఫిబ్రవరి 14 వరకూ ప్రియురాలి గురించి తల్చుకుంటూ ఉంటాడు. యువర్ వాలెంటైన్ అంటూ ఓ లేఖ రాస్తాడు. అదే ఇప్పుడు నీ ప్రేమికుడిగా మారి..వాలెంటైన్ డే గా జరుపుకోడానికి కారణమైంది.కాగా, ఇటీవల ఇండియాలో వాలెంటైన్స్ డేను వ్యతిరేకించడం పరిపాటిగా మారింది. 90 దశకం నుంచే ఇండియాలో వాలెంటైన్ డే జరుపుకుంటూ వస్తున్నారు. ఇది భారతదేశ సంస్కృతి కాదంటూ కొన్ని సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి.వాలెంటైన్ డేను వారం రోజులపాటు జరుపుకొంటారు. ఫిబ్రవరి 7న ప్రారంభమయ్యే వాలెంటైన్ డే రోజ్ డేతో ప్రారంభమవుతుంది. 8వ తేదీన ప్రపోజ్ డే, 9వ తేదీన చాకొలేట్ డే, 10వ తేదీన టెడ్డీ డే, 11వ తేదీన ప్రామిస్ డే, 12వ తేదీన హగ్ డే, 13వ తేదీన కిస్ డే జరుపుకుంటూ...చివరి రోజు ప్రేమికుల రోజు జరుపుకుంటారు.

పిచ్చికుక్క వీరంగం..

మతిస్థిమితం లేని మహిళతో పాటు పాడి ఆవులపై దాడి

విశాలాంధ్ర- మదనపల్లి రూరల్: పిచ్చికుక్క వీరంగం చేసి ఓ మహిళతో పలు పాడి ఆవులను కాటేసింది. మదనపల్లి మండలంలో సోమవారం ఉదయం జరిగిన ఘటనపై బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కొత్తవారిపల్లి పంచాయతీ చెందిన కే రెడ్డమ్మ 65 మతిస్థిమితం లేని కారణంగా ఇంటి ముందరే ఉంటుంది. అదే సమయంలో పిచ్చికుక్క పురుగు గ్రామం నుంచి వీధిలోకి చొరబడి కనిపించిన పాడి ఆవులను కాటేస్తూ వచ్చింది. గమనించిన గ్రామస్తులు పరుగులు తీస్తూ ఇళ్లల్లోకి జారుకున్నారు. అయితే మతిస్థిమితం లేని రెడ్డమ్మ ఇంటి ముందరే ఉండడంతో పిచ్చికుక్క ఆమెపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. స్థానికులు బాధితురాలని వెంటనే మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్సలు పొందుతుంది. కుక్కను చంపడానికి ఎత్తించిన గ్రామస్తులు కుక్క పారిపోవడంతో వదిలిపెట్టి మిన్న కుండిపోయినట్టు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో సౌర విద్యుత్ యూనిట్ ఏర్పాటు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఐసిఐసిఐ బ్యాంకు వారి అధ్వర్యంలో సౌర విద్యుత్ యూనిట్ ను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సోమవారం కళాశాల అవరణంలో ఏర్పాటు చేసిన యూనిట్ ను ఐసిఐసిఐ పౌండేషన్ జిల్లా అభివృద్ధి అధికారిణి, కళాశాల అభివృద్ధి కమిటీ మెంబరు రాజేశ్వరి పూజ చేసి ప్రారంభించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ కళాశాల లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల కు సౌకర్యవంతంగా ప్రయోగాలకు మరింత సహకరించేందుకు విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన సౌర విద్యుత్ ప్యానెల్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కళాశాల అభివృద్ధి కోసం తమ వంతు సహకారం అందించి ప్రోత్సహిస్తామని తెలియజేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డా హర్షలతా పంకజ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ దిశగా సౌర విద్యుత్ ప్యానెల్స్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం,సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీవెన్ సెల్ అర్జీదారుల ఆకలి తీరుస్తున్న ఎంఎల్ఏ

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ప్రతి సోమవారం నాడు జిల్లా కేంద్రమైన రాయచోటిలోని జిల్లా కలెక్టరేట్,ఎస్ పి కార్యాలయా లకు వచ్చే గ్రీవెన్ సెల్ అర్జీదారులు, ప్రజల ఆకలిని ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి తీరుస్తున్నారు.ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమం నేటితో తొమ్మిదవ వారానికి చేరుకుంది. వైఎస్ఆర్ సిపి మదనపల్లె నియోజక వర్గ పరిశీలకులు హబీబుల్లా ఖాన్ సౌజన్యంతో సోమవారం నాడు జిల్లా కలెక్టరేట్, ఎస్ పి కార్యాలయా లకు గ్రీవెన్ సెల్ నిమిత్తం వచ్చిన అర్జీ దారులు, ప్రజలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.ఈ అన్నదాన కేంద్రంలో ఆప్యాయత, ప్రేమగా కొసరి కొసరి కడుపు నిండేలా సేవకులు భోజనాలను వడ్డిస్తున్నారు.వారం వారం ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో దాతల సౌజన్యంతో గ్రీవెన్ సెల్ రోజున జిల్లావ్యాప్తంగా వచ్చే ప్రజలకు రుచికరమైన ,నాణ్యమైన భోజనాన్ని ఉచితంగా అందిస్తుండడంపై హర్షం వ్యక్తం చేస్తూ అన్న దాతలూ సుఖీభవ అంటూ జిల్లా వ్యాప్తంగా ప్రజలు అభినందిస్తూ, దీవెనలు అందిస్తున్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు

విశాలాంధ్ర-మదనపల్లి: కర్ణాటక మద్యం తరలిస్తున్న నిందితుడిపై మదనపల్లి సెబ్ సీఐ శ్రీహరి రెడ్డి సోమవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీఐ కథనం మేరకు.. మదనపల్లి మండలం, సిటీఎం గంగాపురానికి చెందిన మొండి సునీల్ కుమార్21, కర్ణాటక మద్యం 14 ఫుల్ బాటిల్లు(ఓల్డ్ అడ్మిరల్) బ్యాగులో వేసుకుని ఏపీ 03 2233 నెంబరు గల సుజుకి యాక్టివా వాహనంలో మదనపల్లి కి వస్తుండగా చీకలబైలు చెక్పోస్ట్ సిఐ వెంకటలక్ష్మి తనిఖీ చేసే సమయంలో తప్పించుకుని పరారోయి మదనపల్లికి వచ్చాడు అన్నారు. ఆమె ఇచ్చిన సమాచారంతో వెంటనే అప్రమత్తమై ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నిందితుని పట్టుకోవడానికి వెళ్లడంతో అతను బైకు మద్యం వదిలి పరారయ్యాడని చెప్పారు. మద్యం బైకు స్వాధీనం చేసుకుని స్టేషన్కు తీసుకువచ్చి అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కాగా గతంలోనూ ఇతను కర్ణాటక మద్యం విక్రయిస్తూ పట్టుబడిన కేసుల్లో ఉన్నాడని చెప్పారు. త్వరలోనే నిందితున్ని అరెస్టు చేస్తామని సీఐ పేర్కొన్నారు.

గిరిజన తండాకు రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి



విశాలాంధ్ర-రాయచోటిటౌన్: సంబేపల్లి మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామపంచాయతీ వంటిల్లు బిడికి కి రోడ్డు సౌకర్యం కల్పించాలని సోమవా రం గిరిజన సమాఖ్య నాయకుల ఆధ్వర్యంలో గ్రామస్తులు జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియ కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు బుక్కే విశ్వనాథ నాయక్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, లంబాడ సంఘం జాతీయ నాయకులు మూడే శంకర్ మాట్లాడుతూ వంటిల్లు బిడికిలో 25 కుటుంబాలు గిరిజనులు దాదాపు 70 సంవత్సరాలుగా నివాసముంటున్నప్పటికి ఇప్పటివరకు రోడ్డు సౌకర్యం లేకపోవడం దారుణమన్నారు. వెంటనే రోడ్డు సౌకర్యం కల్పించాలని జాయింట్ కలెక్టర్ ను కోరినట్లు తెలిపారు. అనారోగ్యం పాలైన వారు,గర్భవతులు లాంటి వారు ఇప్పటికీ ఎద్దుల బండ్లు మీద వెళ్లాల్సిన పరిస్థితి వుందన్నారు. గిరిజనులకు సంబంధించిన సబ్ ప్లాన్ నిధులను కూడా పక్కదారి మళ్లించి గిరిజనులకు ఇవ్వాల్సిన రాయితీలను ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి గిరిజన తండాకు రోడ్డు సౌకర్యం కల్పించి గిరిజనులు ఆదుకోవాలని కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డి బి ఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు యుగేందర్, వంటిల్లు బిడికి కి సంబంధించిన గిరిజనులు శ్రీరాములు నాయక్ చంద్ర నాయక్ ఎర్రన్న నాయక్ శంకర్ నాయక్ రాంజీ నాయక్ సంజీవ్ నాయక్ కృష్ణా నాయక్ నాగార్జున నాయక్ తదితరులు పాల్గొన్నారు.

84 పక్కా గృహాలు పూర్తి చేయాలి

- మండల ప్రత్యేక అధికారి డి.ప్రభాకర్ రెడ్డి

విశాలాంధ్ర-సిద్ధవటం : సిద్ధవటం మండలానికి వారం రోజులలోపు 84 పక్కా గృహాలను పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్ రెడ్డి మండల అధికారులకు లక్ష్యం ఇచ్చారు. మండల కేంద్రమైన సిద్ధవటం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పక్కా గృహాలపై ప్రత్యేక అధికారి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కా గృహాలను సమన్వయంతో అన్ని శాఖల అధికారులు పూర్తి చేసినందుకు కృషి చేయాలన్నారు. విఎల్,బిబిఎల్, ఆర్ఎల్ స్లాబ్ వంటి వివిధ స్థాయిలో ఉన్న 84 గృహాలకు రూ.33 లక్షలు మంజూరు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపీడీవో పులిరాంసింగ్, ఏపిఎం వెంకటేశు, ఏపీఓ శివశంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

8వ వార్డులో "ఇదేం ఖర్మ - మన రాష్ట్రానికి"

విశాలాంధ్ర-కమలాపురం : టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు టిడిపి ఇన్చార్జ్ పుత్తా నరసింహారెడ్డి ఆదేశాల మేరకు నగర పంచాయతీ పరిధిలో 8వ వార్డు నగర పంచాయతీ పరిధిలోని కె.కొత్తపల్లెలోని వీధిలో "ఇదేం ఖర్మ - మన రాష్ట్రానికి ఏర్పాటు చేశారు. నాయకులు అంకిరెడ్డి మైనార్టీ నాయకుడు ఖాదర్ బాషాలు టీడీపీ నాయకులు ఇంటి ఇంటికి వెళ్ళి ఈ ప్రభుత్వంలో కమలాపురం ప్రజలు పడుతున్న ఇబ్బందులపై అభిప్రాయాలు తెలుసుకుని, పార్టీ ఇచ్చిన అభిప్రాయ సేకరణ పత్రంలో వివరములు సేకరించి, పార్టీ నిర్దేశించిన ఫోన్ నెంబర్ 9261292612 కి మిస్డ్ కాల్ ఇవ్వమని, రాబోయే ఎన్నికలలో టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆరోగ్య కేంద్రం చైర్మన్ జంపాల నరసింహారెడ్డి, నియోజకవర్గం రైతు అధ్యక్షుడు చాపాడు ప్రభాకర్ రెడ్డి, శివ శంకర్ రెడ్డి, పల్లె రామ సుబ్బారెడ్డి, రామునిరెడ్డి, రేలా చంద్ర శంకర్ యాదవ్, దాదిరామయ్య, రవీంద్రారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, లోకేశ్వర్ రెడ్డి, శ్రీను, రవిశంకర్, టీఎన్టీయుసీ నాయకుడు మల్లేష, చంద్ర రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీ లక్ష్మీనారాయణ, గండి గోపాల్, ప్రవీణ, భాగ్యలక్ష్మి, మోదిన్ బి, ఐటీడీపీ అబ్దుల్ నబి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రైతాంగానికి కిసాన్ మోర్చా విజ్ఞప్తి

బుడ్డ సేనగలను కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు

- సింగారెడ్డి రామచంద్రారెడ్డి, వి.శశి భూషణ్ రెడ్డి

విశాలాంధ్ర- కడప కార్పొరేషన్ : ఏపీలోని బెంగాల్ గ్రామ్ బుడ్డ సెనగ లను నాఫేడ్ అనే సంస్థ ద్వారా కేంద్ర ప్రభుత్వం 5335 రూపాయలతో కొనుగోలు చేస్తుందని రైతులు దాలారిలను నమ్మి మోసపోకుండా మీదగ్గరలోని అర్ బి ఐ కేంద్రాలలో మీ పేర్లను రిజిస్టర్ చేసుకొని లబ్ది పొందాలని బి.జే.పి కిసాన్ మొర్చ నాయకులు సింగారెడ్డి రామచంద్రా రెడ్డి, వంగలి షశిభూషన్ రెడ్డి లు తెలిపారు. సోమవారం సింగారెడ్డి రామచంద్రారెడ్డి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు బెంగాల్ గ్రామ్ బుడ్డ సెనగ లపై అపోహలు కలిగిస్తున్నారని, అపోహలను వీడి బుడ్డ శనగలను సాగు చేసే రైతులకు బిజెపి వెన్నంటే ఉంటుందన్నారు. రాష్ట్రంలోని అధికార పార్టీ, ప్రతిపక్షాలు రైతాంగం పట్ల పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. ప్రజలు బిజెపికి అవకాశం ఇస్తే రాష్ట్ర అభివృద్ధితో పాటు రైతాంగ వ్యవస్థను కూడా పూర్తిగా అభివృద్ధి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను తెలియజేసి రైతులకు భరోసా కల్గించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బుడ్డ సెనగలను కేంద్ర ప్రభుత్వ కొనుగోలు చేసి ఇరవై ఒక్క రోజు లోపల నేరుగా రైతుల అకౌంట్లో సొమ్మును జమ చేయడం జరుగుతుందన్నారు. ఏపీలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ రెడ్డి, ఆనంతకేశవ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అప్పర్ భద్రాను ఆపాల్సిందే

కలెక్టరేట్ వద్ద అఖిలపక్ష నాయకుల నిరసన

విశాలాంధ్ర- కడప కార్పొరేషన్ : కర్ణాటకలో తుంగభద్రా నది పై కడుతున్న అప్పర్ భద్ర ప్రాజెక్టును ఆపాల్సిందేనని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు వైసిపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసే పరిస్థితి ఉందని అనుమానాన్ని వ్యక్తపరిచారు. సీమవాసులమని వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి, ఆయన కుమారుడు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఓట్లు కొల్లగొట్టి సీమకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. పాదయాత్రలో రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, కడప ఉక్కు తెస్తానన్న జగన్ అధికారంలోకి వచ్చి మరిచారని మండిపడ్డారు, కేసీ కెనాల్, గండికోట, మైలవరం, అన్ని ప్రాజెక్టులకు తుంగభద్ర కీలకమన్నారు, కేంద్ర ప్రభుత్వం నిర్మాణానికి నిధులు ఇచ్చి ప్రోత్సహిస్తుందన్నారు, ముఖ్యమంత్రి జగన్ వివేక హత్య కేసు నుంచి బయటపడడానికి ప్రధాని మోడీకి దాసోగంగా మారారని విమర్శించారు, రాయలసీమకు నీటి కష్టాలు తెచ్చే అప్పర్ భద్రాను ఆపాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నారాయణ మాట్లాడుతూ అప్పర్ భద్ర నిర్మాణం వల్ల నీటి పరిమాణం పడిపోతుందని, రాయలసీమలో ఎనిమిది లక్షల ఎకరాల్లో పంట సాగు అవుతుందన్నారు.నీటి అవసరం ఉందని చెప్పారు, ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచి కృష్ణ నదికి నీరు రాకుండా చేశారని గుర్తు చేశారు. ఎన్నికల రాజకీయం కోసం కేంద్ర ప్రభుత్వం భద్రకు నిధులు విడుదల చేసిందని విమర్శించారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మీ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్, హరి ప్రసాద్ మాట్లాడుతూ రాయలసీమకు అన్యాయం జరిగే ప్రాజెక్టు అప్పర్ భద్ర అన్నారు. బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం జాతీయ హెూదా ఇచ్చిందని, ముఖ్యమంత్రి జగన్ ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశపరిచి, అడ్డుకునే ప్రయత్నాలు చేయకపోవడం సీమకు అన్యాయం చేకూర్చే విధంగా ఉందని చెప్పారు. ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు అప్పర్ భద్ర ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, నగర కార్యదర్శి రామ మోహన్ మాట్లాడుతూ అనాదిగా రాయలసీమకు అన్యాయమే జరుగుతుందని, సీమ వాసులు రాష్ట్రానికి ముఖ్యమంత్రులు అయినప్పటికీ సీమ అభివృద్ధికై దృష్టి సారించలేదన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి కలిసికట్టుగా పోరాడతామని హెచ్చరించారు. లోక్సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవర శ్రీకృష్ణ మాట్లాడుతూ ఎగువ భద్ర ప్రాజెక్టు వల్ల సీమ ఎడారిగా మారుతుంది అన్నారు. ముఖ్యమంత్రి జగన్, ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజకీయాలకు అతీతంగా రాయలసీమ హక్కుల కోసం ముందుకు సాగాలని అన్నారు. అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి హరి, నగర అధ్యక్షుడు శివ కొండారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి అవార్డుకు ఎంపికైన స్కౌట్ విద్యార్థులకు ఇన్చార్జి కలెక్టర్ ప్రశంసలు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:రాష్ట్రపతి చేతుల మీదుగా అందించే గోల్డెన్ యారో అవార్డుకు ఎంపికైన స్కౌట్స్ విద్యార్థులను జిల్లా ఇన్చార్జి కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం కలెక్టరేట్లోని స్పందన హల్ లో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అన్నమయ్య జిల్లా నుండి 6 మంది విద్యార్థులు రాష్ట్రపతి అవార్డుకు ఎంపిక కావడం ఎంతో శుభ పరిణామమన్నారు. విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన స్కౌట్ అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. డీఈవో రాఘవరెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 19 నుండి 23 వరకు హర్యానాలో జరిగే గోల్డెన్ యారో అవార్డు ఉత్సవంలో అన్నమయ్య జిల్లాకు చెందిన స్కౌట్ విద్యార్థులు ఉండడం ప్రతి ఒక్కరూ గర్వించదగ్గ విషయమన్నారు. వీరిలో కురబలకోట మండలం నార్లపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన బి.భువనేష్, దిగువ చెన్నామరి ప్రాథమిక పాఠశాలకు చెందిన బి.చరిత్ రెడ్డి, బి.కార్తీక్, వాయల్పాడు మండలం ప్యారం పల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎన్.శ్రీనివాసులు, బి.అభిషేక్, మదనపల్లి మండలం బాబు నగర్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఎన్. నవీన్ కుమార్ లు ఉన్నారని తెలిపారు . వీరితోపాటు భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ క్లబ్ (సి యు బి) మాస్టర్స్ ఆర్.సిద్ధారెడ్డి, కె.సుబ్బారెడ్డి, ఏ.చంద్రశేఖర్ రెడ్డి, వై.రవీంద్రారెడ్డిలు పాల్గొంటున్నారన్నారు. చిన్ననాటి నుండే విద్యార్థులలో సేవాభావం, క్రమశిక్షణ, దేశభక్తి అలవడడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ దోహదం చేస్తుందన్నారు. రాష్ట్రపతి అవార్డుకు ఎంపికైన విద్యార్థులకు అన్నమయ్య జిల్లా విద్యాశాఖ తరఫున శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో సత్యనారాయణ, ల్యాండ్ అండ్ సర్వే ఏడి జయరాజు, స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరీ నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాలను అడ్డుకుంటే అక్రమ అరెస్టులా?

- అక్రమంగా అరెస్ట్ చేసిన అఖిలపక్ష నాయకులను విడుదల చేయాలి
- దర్గా స్థలాన్ని ఆక్రమిస్తున్న ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి బామ్మర్ది సుబ్రహ్మణ్యం అరెస్టు చేయాలి

విశాలాంధ్ర-కడప రూరల్ : కడప నగరం నడిబొడ్డున ఉన్న రామకృష్ణ స్కూల్ వెనుక వైపు రఖీబ్ షావల్లి దర్గా స్థలం ఆక్రమణను అడ్డుకున్న అఖిలపక్ష పార్టీ నాయకులను విడుదల చేయాలని కార్పొరేషన్ గాంధీ విగ్రహం వద్ద అఖిలపక్ష నాయకులు నిరసన చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 200 కోట్లు రూపాయలు విలువ చేసే దాదాపు రెండు ఎకరాలు స్థలంను సజ్జల రామకృష్ణారెడ్డి బామ్మర్ది సుబ్రహ్మణ్యం ఆక్రమణ చేసి కాంపౌండ్ వాల్ నిర్మిస్తుంటే అఖిలపక్ష నాయకులు అడ్డుకుంటే అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం దారుణం అన్నారు. సమస్య పరిష్కారమయినంత వరకు ఎవరు పనులు చేయకూడదని కోర్టు స్టే ఇచ్చినప్పటికీ కోర్టును ఆర్డర్ను ధిక్కరించి అక్రమంగా కట్టడాలు నిర్మించడం అంటే దీని వెనుక ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రమేయం పుష్కలంగా ఉందన్నారు. సీఎం సొంత జిల్లాలోనే మసీదు స్థలానికి కబ్జా చేస్తుంటే జిల్లా అధికార యంత్రాంగం చోద్యం చూస్తూ కబ్జాదారులకు కొమ్ము కాయడం సిగ్గుచేటు అన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం అతి ఉత్సాహంతో కబ్జాదారులకు కుమ్ము కాయడం వాళ్లు తా అంటే తందానా అనడం పోలీస్ డిపార్ట్మెంట్ కి అవమాన కరమన్నారు. ప్రభుత్వ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పోరాటాలు చేస్తే అక్రమ అరెస్టు చేసి భయభ్రాంతులకు గురి చేయడం సరైనది కాదని, కోర్టు నిర్ణయం వచ్చేంతవరకు దర్గా స్థలాన్ని కాపాడాలన్నారు. అరెస్టు చేసిన అఖిలపక్ష నాయకులు వెంకటశివ, అమీర్‌బాబు, బాబు బాయ్, సల్లావుద్దీన్, బాదుల్లా, రెహమాన్, ఇమ్రాన్, జాకీర్, మైనుద్దీన్‌లను భేషరతుగా విడుదల చేయాలని లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగ సుబ్బారెడ్డి, అంజనేయులు, సి. సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు వికాస్ హరి, జిలాను, అమీర్, శివ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ఏ సత్తార్, మైనారిటీ రైట్ ఫోరమ్స్ రాష్ట్ర అధ్యక్షులు దస్తగిరి, సిపిఐ నగర సహాయ కార్యదర్శి ఉద్దె.మద్దిలేటి.నగర నాయకులు మల్లికార్జున నారాయణ, సుబ్బరాయుడు, గంజికుంట నాగరాజు, మునయ్య తదితరులు పాల్గొన్నారు.